www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 204 | బుధవారం 23.09.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-




## దసరా కానుకగా కొత్త పెన్షన్ల పంపిణీ

- కొత్త పింఛన్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం..
- అర్హులైన పేదలకు దసరా కానుక..
- ఒంటరి మహిళలు, వితంతువులకు తొలి ప్రాధాన్యం..

02



## ఎన్ని కోట్ల ప్యాకెట్లు కావాలి..

- బ్లడ్ బ్యాంక్ ఆరోపణలపై చిరు ఫైర్
- 'బ్లడ్ అమ్ముకుంటున్నానా?'.. చిరు ఆవేదన
- ఆరోపణలకు చిరంజీవి ఘాటు కౌంటర్
- అభిమానుల కోసం చిరు కొత్త రోడ్‌మ్యాప్

02



## పౌరుల వ్యక్తిగత నిర్ణయం

- ఎన్ని చరణాలు పాడాలో వ్యక్తిగత నిర్ణయమే: సుప్రీం
- వందేమాతరం ఆలాపనపై సుప్రీం కీలక వ్యాఖ్యలు
- అన్ని చరణాలు పాడకపోతే శిక్షించలేరు: సుప్రీం

02



## బొల్లారం ఆయుధాల చోరీ కేసు..

- ఆర్మీ అధికారులపై కక్షతోనే చోరీకి కుట్ర?
- 16 ఏళ్ల అనుభవంతో ఆయుధాల చోరీకి పథకం
- సీసీటీవీలపై ఆర్మీ సిబ్బందిని ఆరా తీసిన నిందితుడు

02





# శోభాయాత్రకు సన్నాహాలు

### మహాగణపతి నిమజ్జనంపై ఫోకస్



### ఖైరతాబాద్ గణపయ్యకు నేడు ఆఖరి పూజ

- ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు
- మహాగణపతి నిమజ్జన ట్రయల్స్..
- మార్గంలో అడ్డంకుల గుర్తింపు
- ఖైరతాబాద్ గణపతి శోభాయాత్రకు రూట్ ఖరారు
- శుక్రవారం ఉదయం 6 గంటలకు మహాగణపతి శోభాయాత్ర
- మధ్యాహ్నం 12లోపు నిమజ్జనం పూర్తి చేయాలని లక్ష్యం
- నిమజ్జన మార్గంలో అడ్డంకుల తొలగింపునకు ఆదేశాలు

03



# చదువుతోనే జీవితాలు మారుతాయి..

### తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి

**ఆ వర్గాలను దృష్టిలో పెట్టుకునే సంక్షేమ పథకాల అమలు**

**దళిత, గిరిజనుల అభివృద్ధే లక్ష్యం**

**ఎస్సీ, ఎస్టీల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం**

- ఎస్సీ, ఎస్టీ అభివృద్ధిపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు
- అట్టడుగు వర్గాలకు అండగా ప్రభుత్వం
- చదువు, క్రీడల వైపు పిల్లలను ప్రోత్సహించాలి
- ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలు.. సీఎం కీలక ప్రకటన
- అత్యాచార బాధితులకు తక్షణ పరిహారం
- దళిత, గిరిజన సంక్షేమంపై ప్రభుత్వ ఫోకస్
- ఇందిరమ్మ స్ఫూర్తితో పనిచేస్తున్నాం
- ఎస్సీ, ఎస్టీల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం
- విద్యతోనే అట్టడుగు వర్గాల జీవితాల్లో మార్పు

03

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

దళితులు, ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని సొంత తల్లిలా ప్రేమ చూపించిన ఇందిరమ్మను వారు ఇప్పటికీ మరిచిపోలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక ఇవాళ తొలిసారి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టంపై సమీక్ష జరిగింది. ఈ సమీక్షలో పాల్గొన్న సీఎం ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 25 లక్షల ఎకరాలకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరాగాంధీదని ఇందిరా గాంధీ స్ఫూర్తితోనే ఈ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయిస్తున్నామని ప్రభుత్వం ఈ వర్గాల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

# రిమ్స్‌లో అర్ధరాత్రి అగ్నిప్రమాదం..

### 28 మంది చిన్నారులను సురక్షితం

**ఏసీలో షార్ట్‌సర్క్యూట్.. రిమ్స్‌లో అగ్నిప్రమాదం**

**రిమ్స్ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి**





చిన్నారి మృతిపై మంత్రి దామోదర్ దిగ్భ్రాంతి

- ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్నిప్రమాదం.. ఇద్దరు చిన్నారులు మృతి
- ఎస్ఎన్‌సీయూలో మంటలు.. ఇద్దరు శిశువుల మృతి
- రిమ్స్ ఎస్ఎన్‌సీయూలో విషాదం.. ఇద్దరు నవజాత శిశువులు మృతి
- ఏసీలో షార్ట్‌సర్క్యూట్.. రిమ్స్‌లో అగ్నిప్రమాదం
- 28 మంది చిన్నారులను సురక్షితంగా తరలింపు
- రిమ్స్ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి
- అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణకు సీఎం ఆదేశం
- ఆసుపత్రుల్లో భద్రత పెంచాలి: సీఎం రేవంత్‌రెడ్డి

05



## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అరెస్ట్

- రాంచందర్‌రావు అరెస్ట్‌పై బీజేపీ ఆగ్రహం
- జూరాల నీటి కోసం రైతుల ఆందోళన.. రాంచందర్‌రావు అరెస్ట్
- పోలీసుల చర్యను ఖండించిన రాంచందర్‌రావు

03



# నీటి విడుదలకు ప్రభుత్వం ప్లాన్..!

### వేగంగా కదులుతున్న సర్కార్

- సాగునీటి విడుదలపై సర్కార్ కీలక నిర్ణయం
- రైతులకు నీరందించేందుకు ప్రభుత్వం కసరత్తు
- కర్ణాటక నుంచి నీటి ప్రవాహం పెంచే ప్రయత్నాలు
- పంటలు ఎండిపోకుండా చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- నీటి కోసం రైతుల ఆందోళన.. రాజకీయ వేడి
- రైతుల సమస్యపై బీజేపీ నిరసన
- జలాల కోసం పోరు.. నేతల అరెస్టులు

03

**కర్ణాటక సీఎం శివకుమార్‌కు ఫోన్‌లో విజ్ఞప్తి చేసిన రేవంత్**






## విద్యుత్ నిర్వహణలో ప్రభుత్వం ఫెయిల్

- రేవంత్ వైఫల్యాన్ని ఎల్‌నినోపై నెట్టేస్తున్నారు: హరీశ్‌రావు
- ఏపీలో రైతుల కేరింతలు.. తెలంగాణలో ఆక్రందనలు: హరీశ్‌రావు
- శ్రీశైలం నీళ్లపై రేవంత్‌కు హరీశ్‌రావు కౌంటర్
- రైతుల పంటలు ఎండిపోతున్నాయి.. ప్రభుత్వం ఫెయిల్: హరీశ్‌రావు

02

# రేవంత్ రెడ్డిపై ఈటల ఫైర్

### కేసీఆర్ మీద కోపంతో రైతులను ఆగం చేస్తావా?..



**ఎల్‌నినో పేరుతో చేతులు దులుపుకుంటున్నారు**

**రైతులకు కనీసం 7-8 గంటల కరెంట్ కూడా లేదు**

- రైతుల కష్టాలపై ఈటల రాజేందర్ ఫైర్
- తెలంగాణ రైతులకు నీళ్లు, కరెంట్ ఏదీ?
- ఎల్‌నినో పేరుతో చేతులు దులుపుకుంటున్నారని విమర్శ
- నీళ్లు ఉన్నా రైతులకు ఎందుకు ఇవ్వడం లేదు?
- జూరాల నీటిపై ప్రభుత్వాన్ని నిలదీసిన ఈటల

03

# పౌరుల వ్యక్తిగత నిర్ణయం

**ఢిల్లీ:** వందేమాతరం గీతాలాపనపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వందేమాతరం ఒక చరణం పాడాలా లేక నాలుగు చరణాలు పాడాలా ఎన్ని చరణాలు పాడాలన్నది పౌరుల వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేసింది. వందేమాతరం 6 చరణాలు ఆలాపనను ఇటీవల కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేయడంపై ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు టి.ఎం కృష్ణ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం.. అన్ని చరణాలు పాడని వారిపై శిక్షాత్మక చర్యలు తీసుకోలేరని వ్యాఖ్యానించింది. కేంద్రం విధించే శిక్షాత్మక చర్యల అంశాన్ని పరిశీలిస్తామన్న సుప్రీంకోర్టు.. వందేమాతరం సవరణ చట్టం, మార్గదర్శకాలపై కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై రెండు వారాల్లోగా సమాధానం చెప్పాలని పేర్కొంది. పౌరుల మత విశ్వాసాలకు రాజ్యాంగ రక్షణ ఉంటుందని స్పష్టం చేసింది.

**పొలిటికల్ వివాదం వేళ సుప్రీం కీలక వ్యాఖ్యలు:**

గత 70 ఏళ్లుగా వందేమాతరంలో మొదటి రెండు చరణాలు మాత్రమే ఆలపించే ఆనవాయితీ ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఇటీవల మొత్తం ఆరు చరణాల ఆలాపనను తప్పనిసరి చేస్తూ సర్క్యులర్ జారీ చేసింది. అంతేకాకుండా, దీనికి 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా కల్పిస్తూ, ఆలాపనకు అంతరాయం కలిగిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టసవరణ తెచ్చింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసుడు టి.ఎమ్. కృష్ణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చివరి నాలుగు చరణాల్లో నిర్దిష్ట మతపరమైన అంశాలు ఉన్నందున, వాటిని బలవంతంగా పాడించాలని చూడటం రాజ్యాంగం ప్రసాదించిన లౌకికత్వానికి, మతస్వేచ్ఛకు మరియు వ్యక్తిగత స్వేచ్ఛకు విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో స్పష్టం చేశారు. వందేమాతరం అంశం దేశవ్యాప్తంగా రాజకీయంగానూ హాట్ టాపిక్ గా మారిన వేళ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి.

# బీహార్ లైంగిక వేధింపుల ఘటనలో నిందితుడి ఎన్‌కౌంటర్..

**బీహార్ :** బీహార్‌లోని జముయిలో ఇటీవల జరిగిన ఓ దారుణమైన లైంగిక దాడికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. యూనిఫాంలో ఉన్న ఒక పాఠశాల విద్యార్థి, విద్యార్థిని పట్ల కొందరు కుర్రాళ్ళు తీవ్రంగా బూతులు మాట్లాడుతూ, ఆ అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తిస్తూ (బ్యాడ్ టచ్ చేస్తూ) గొడవ చేశారు. ఈ వీడియో నెట్టింట వైరల్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. చివరికి జాతీయ మహిళా కమిషన్ కూడా ఈ ఘటనపై సీరియస్‌గా స్పందించి ఆరా తీసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు బాధ్యులైన వారిని గుర్తించి, మొదట ముగ్గురిని అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడు సహా మరో నలుగురు పరారయ్యారు. ఈ పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తుండగా, జముయిలో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు నందన్ యాదవ్, మరో నిందితుడు హరే రామ్‌లను పట్టుకోవడానికి వెళ్లిన పోలీసులపై వారు ఎదురుదాడికి దిగడంతో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు నందన్ యాదవ్ కాలికి బుల్లెట్ గాయమవ్వగా, మరో నిందితుడు హరే రామ్‌కి కాలు విరిగింది. ఎన్‌కౌంటర్ అనంతరం వీరిద్దరినీ వెంటనే చికిత్స నిమిత్తం జముయి సదర్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని బీహార్ పోలీస్ లా అండ్ ఆర్డర్ ఏడీజీ కేఎస్ అనుపమ్ అధికారికంగా ధృవీకరించారు. ఈ కేసు విచారణను పోలీసులు అత్యంత వేగంగా వేగవంతం చేశారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కొత్త నేర చట్టం బీఎన్ఎస్ఎస్ లోని 128, 74, 75 సెక్షన్లతో పాటు చిన్న పిల్లలపై వేధింపుల నిరోధక చట్టం (పోక్సో) కింద సెక్షన్ 8, 12లను నమోదు చేశారు. అంతేకాకుండా, ఈ కేసును నిష్పాక్షికంగా, వేగంగా విచారించేందుకు జముయి ఎస్డీపీఓ పర్యవేక్షణలో ఒక ప్రత్యేక విచారణ బృందాన్ని (ఎస్ఐటీ) ఏర్పాటు చేశారు. మొత్తానికి విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితులపై జముయి పోలీసులు తీసుకున్న ఈ కఠిన చర్యతో స్థానికంగా పెద్ద ఎత్తున ఊరట వ్యక్తమవుతోంది.

# ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల డంప్ భగ్నం..



**ఛత్తీస్‌గఢ్ :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలకు పెద్ద విజయం దక్కింది. మావోయిస్టులు రహస్యంగా దాచిపెట్టిన ఆయుధాల డంప్‌ను బలగాలు భగ్నం చేసి, భారీ మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి.

**బేద్రే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆపరేషన్..**

బీజాపూర్ జిల్లా బేద్రే పోలీస్ స్టేషన్ పరిధిలోని లంకా పహాడి గ్రామ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు విస్తృత గాలింపు చర్యలు, మైన్ల తొలగింపు ఆపరేషన్ చేపట్టాయి. ఈ తనిఖీల్లో భాగంగా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు భూగర్భంలో గుట్టుగా దాచిపెట్టిన డంప్‌ను బలగాలు గుర్తించాయి. మైన్ల తొలగింపు సమయంలో బయటపడిన ఈ మావోయిస్టుల రహస్య డంప్ నుంచి భారీ పరిమాణంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని రికవర్ చేసినట్లుఇవ అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాటిలో ప్రధానంగా ఎస్ఎల్ఆర్ రైఫిల్స్, ఇన్సాస్ రైఫిల్స్, 315 బోర్ గన్స్, బీజీఎల్ లాంచర్లు, బీజీఎల్ సెల్‌లు, చైనీస్ హ్యాండ్ గ్రెనేడ్‌లు ఉన్నాయి. అయితే, ఈ భారీ ఆయుధాల గుర్తింపుతో మావోయిస్టుల పెద్ద కుట్ర భగ్నమైందని భద్రతా బలగాలు వెల్లడించారు. ఆ ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా పెంచామని, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని భద్రతా బలగాలు తెలిపాయి

# పోలీస్ స్టేషన్ నుంచి పాత నేరస్తుడి పరార్..!

**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా:** దొంగతనం కేసులో కీలక ఆధారం లభించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్న పాత నేరస్తుడు పోలీసుల కళ్లుగప్పి పరారైన ఘటన సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో కలకలం రేపింది. దొంగతనం జరిగిన ప్రాంతంలో లభించిన వేలిముద్రలను పరిశీలించగా పాత నేరస్తుడికి సరిపోలడంతో ఆదివారం ఉదయం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం స్టేషన్‌కు తరలించారు. అయితే విచారణకు ముందే పోలీసుల దృష్టిని మరల్చి అక్కడి నుంచి తప్పించుకున్నట్లు సమాచారం.

**వేలిముద్రలతో గుట్టురట్టు..**

ఇటీవల జరిగిన దొంగతనం కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆధారాలను సేకరించారు. ఆదివారం ఉదయం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ చౌరస్తాలో బయోమెట్రిక్ చెక్ చేపట్టారు. అందులో లభించిన వేలిముద్రలను పాత నేరస్తుల వివరాలతో పోల్చగా ఓ వ్యక్తి వేలిముద్రలతో సరిపోలినట్లు గుర్తించారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**విచారణకు ముందే జారుకున్న నిందితుడు..**

పాత నేరస్తుడు పోలీస్‌స్టేషన్‌లో ఉండగా అతడిని విచారించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. అయితే వారి దృష్టిని మరల్చి నిందితుడు అక్కడి నుంచి తప్పించుకున్నట్లు తెలిసింది. ఇదే విషయమై కొండాపూర్ ఎస్సై సోమేశ్వరుని దిశ వివరణ కోరగా ఫింగర్ ప్రింట్ చెకింగ్‌లో భాగంగా గతంలో పలు దొంగతనాలలో నిందితుడిగా ఉన్న పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. స్టేషన్ కు తరలించిన అనంతరం తను భయంతో అక్కడి నుంచి అక్కడ ఉన్న సిబ్బంది దృష్టి మరల్చి జారుకున్నాడని వివరించారు. ప్రస్తుతం నిందితుడి కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అతడిని పట్టుకుంటామని ఎస్ఐ స్పష్టం చేశారు.

# విద్యుత్ నిర్వహణలో ప్రభుత్వం ఫెయిల్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రేవంత్ రెడ్డి చేతకానితనాన్ని ఎల్ నినో మీదకు తోస్తున్నాడు.. రేవంత్ రెడ్డి పని తీరుతో ఏపీలో రైతుల కేరింతలు తెలంగాణలో రైతుల కన్నీరు మిగిలాయని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు శ్రీశైలం నీళ్లు బేసిన్ కు సంబంధం లేని కుప్పంకు తీసుకెళ్లారని, ఏపీ సీఎం శ్రీశైలం నుంచి 700 కిలోమీటర్లు క్రిష్ణా నదీ జలాలు తీసుకువెళ్తున్నారన్నారు. బేసిన్ కాని బేసిన్‌కు చంద్రబాబు నీళ్లు తీసుకెళ్తుంటే బేసిన్‌లోనే ఉన్న ప్రాజెక్టులకు రేవంత్ రెడ్డి నీళ్లు తీసుకెళ్లడం లేదని, తన సొంత జిల్లా పంటలను ఎండబెడుతున్నారని దుయ్యబట్టారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు.

**విద్యుత్ నిర్వహణలో ప్రభుత్వం ఫెయిల్:**

విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం ఫెయిల్ అయిందని హరీశ్ రావు విమర్శించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పూర్తి సామర్థ్యం 4 వేల మెగావాట్లకు 400 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారని కేసీఆర్ విజన్‌తో దేశంలో ఎక్కడా లేని విధంగా యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించారన్నారు. యాదాద్రికి జీ10, జీ11 క్వాలిటీ కోల్ కావాలి. కానీ జీ13,జీ14 క్వాలిటీ కోల్ వాడుతున్నారని బొగ్గు వాడకంలో నాణ్యత లోపం ఉందని ఆరోపించారు. కొత్తగూడెంలో 800 మెగావాట్లు, భద్రాద్రిలో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగిందన్నారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉంటే ఈ రోజు బొగ్గు కొరత ఎందుకు ఏర్పడుతుందని ప్రశ్నించారు. ఈ నిల్వలు ఎక్కడ అని ప్రశ్నించేందుకు నేను క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళితే పోలీసులు అడ్డుకున్నారన్నారు. థర్మల్ పవర్ స్టేషన్ లో 45 రోజులు బొగ్గు నిల్వలు ఉండాలన్నారు.

**రాజస్థాన్‌కు కరెంటు ఇవ్వాల్సిన అవసరం ఏముంది?:**

రాష్ట్ర విభజన సందర్భంగా 1600 మెగావాట్ల విద్యుత్ ఎన్‌టీపీసీ ద్వారా ఇస్తామని చెప్పారు. వేయి మెగావాట్లు తొలివిడతగా ఎన్టీపీసీ 800 మెగావాట్ల కేంద్రాన్ని స్థాపించేలా చర్యలు తీసుకుని పవర్ తీసుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వద్దు అని ఎందుకు చెప్పింది. ఖర్చు లేని పనికి ఎందుకు నో చెబుతోందని నిలదీశారు. మన దగ్గర తయారు అయ్యే సింగరేణి ఉత్పత్తి విద్యుత్ వద్దు అని రాజస్థాన్ ప్రభుత్వంతో పీపీఏ కుదుర్చుకున్నారని రాజస్థాన్‌కు కరెంటు ఇవ్వాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. రైతుల పంటలు ఎండబెట్టి ఉసురుబోసుకుంటున్నారని కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన విద్యుత్ ఉత్పత్తిలో 3వ వంతు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. రైతులకు 7 నుంచి 8 గంటలు కరెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. గులాబీ చొక్కాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని మంత్రి పొంగులేటి అంటున్నారని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రి సీతక్క తల్లిదండ్రులకు పోడు పట్టాలు ఇచ్చామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడి వల్లే మంత్రులు కర్ణాటక వెళ్తున్నారన్నారు.

# బొల్లారం ఆయుధాల చోరీ కేసు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ కేసులో నిందితుడు మల్లేష్‌ను విచారించిన పోలీసులు.. అతడి నుంచి పలు సంచలన విషయాలు రాబట్టారు. నాలుగు నెలల ముందే అతడు ఈ ఆయుధాల చోరీకి పథక రచన చేసినట్లు బొల్లారం పోలీసులు గుర్తించారు. ఆదివారం.. సెలవు దినం కాబట్టి ఆ రోజే ఆయుధాలను చోరీ చేయాలని అతడు ముందుగా ప్లాన్ వేశాడని తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం రోజు గార్డ్ ఇన్‌చార్జ్‌లు, ఆర్మీ అధికారుల కదలికలు తక్కువగా ఉంటాయని అతడు గుర్తించి.. ఈ నిర్ణయం తీసుకున్నాడని వివరించారు. దీంతో ఆ రోజే ఆయుధాల చోరీకి అతడు స్కెచ్ వేశాడని చెప్పారు. అలాగే చోరీ చేసిన ఆయుధాలను సంఘ విద్రోహశక్తులకు విక్రయించాలని మల్లేష్ భావించాడని పోలీసులు పేర్కొన్నారు. అందుకోసం ఆయుధాలు కొనుగోలు చేసే వ్యక్తుల కోసం సోషల్ మీడియాలో అతడు తీవ్రంగా వెతికినట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. తద్వారా వచ్చిన నగదుతో తన ఆర్థిక నష్టాలను పూడ్చుకోవాలని మల్లేష్ నిర్ణయించాడని అన్నారు. మూడేళ్ల పాటు సర్వీస్ ఉన్నప్పటికీ.. విధుల నుంచి తొలగించడంతో ఆర్మీ అధికారులపై మల్లేష్ కక్ష పెంచుకున్నాడని తెలిపారు. దీంతో మద్రాస్ బెటాలియన్ నుంచి ఆయుధాలు చోరీ చేయడం



ద్వారా ఆ అధికారుల ప్రతిష్ఠ దెబ్బతీయాలని మల్లేష్ ఈ పథకం వేశాడని వివరించారు. దాదాపు 16 ఏళ్ల పాటు మద్రాస్ రెజిమెంట్‌లో మల్లేష్ విధులు నిర్వహించాడని పోలీసులు చెప్పారు. ఆ అనుభవంతోనే ఆయుధాలు చోరీ చేసినట్లు తమ దర్యాప్తులో గుర్తించామని పేర్కొన్నారు. ఇక ఆర్మీలో తన స్నేహితులు ఇన్‌చార్జ్ నాయక్ వినోద్, మ్యాగజైన్ ఇన్‌చార్జ్ బల్లి మధు, గార్డ్ ఇన్‌చార్జ్ హవాల్దార్ కేవీ రమణతోపాటు క్వార్టర్ గార్డ్ ఇన్‌చార్జ్ నిరేష్‌తో మల్లేష్ తరచూ ఫోన్ కాల్స్ మాట్లాడినట్లు గుర్తించామని పోలీసులు వివరించారు. ఆర్మీ స్నేహితులతో మాట్లాడి మద్రాస్ రెజిమెంట్‌లో సీసీటీవీ కెమెరాలు.. ఎప్పుడు ఆఫ్ చేస్తున్నారంటూ వారిని మల్లేష్ ఆరా తీసిన వారు వెల్లడించారు.

# ఎన్ని కోట్ల ప్యాకెట్లు కావాలి..

**ఆంధ్రప్రదేశ్ :** బ్లడ్ బ్యాంక్ విషయంలో గతంలో వచ్చిన ఆరోపణలు, విమర్శలపై టాలీవుడ్ యాక్టర్ మెగాస్టార్ చిరంజీవి సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. ఇవాళ నిర్వహించిన మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అభిమానుల సమావేశంలో మాట్లాడిన చిరంజీవి.. బ్లడ్ బ్యాంక్ ద్వారా తాము రక్తం అమ్ముకుంటున్నామంటూ వచ్చిన ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. అందరి జీవితాల్లో కేక్ వాక్‌లు (సులువైన మార్గాలు) ఉండవని కొంతమంది 'మీకు కుదిరింది అయ్యా.. మాకు ఎలా కుదురుతుంది?' అని మాట్లాడుతుంటారు. కానీ నా విషయంలో తీవ్రమైన అవమానాలు ఎదురయ్యాయని గుర్తు చేశారు. బ్లడ్ అమ్ముకుంటున్నానని నిందలు వేశారు. అసలు నాకు వచ్చే రెమ్యూనరేషన్ ముందు ఎన్ని కోట్ల బ్లడ్ ప్యాకెట్లు అమ్మితే ఆ డబ్బు వస్తుంది? అలా ఆలోచిస్తే ఆ మాట ఎంత ఫూలిష్‌నెస్‌తో అర్థమవుతుందంటూ చిరంజీవి ఆవేదనతో ఆరోపణలను తిప్పికొట్టారు.

**అభిమానుల కోసం చిరు రోడ్‌మ్యాప్:**

రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ఉన్న తన అభిమానులను నేరుగా కలవడానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మెగాస్టార్ వెల్లడించారు. ఫ్యూచర్‌లో అన్ని రాష్ట్రాల్లోని నా అభిమానులను వ్యక్తిగతంగా కలుసుకునేందుకు ఒక రోడ్‌మ్యాప్ రూపొందిస్తున్నామని మీరు నా నుంచి ఏమి కోరుకుంటారో.. అది అందించడానికి నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను అని వ్యాఖ్యానించారు. సమాజ సేవ కోసం నిరంతరం కృషి చేసే అభిమానులే తన బలం అని, వారి ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తానని చిరంజీవి స్పష్టం చేశారు. తన కూతురు సుస్మితతో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని మెగా యూత్ ఫోర్స్ మరింత బలోపేతం కావడానికి మీ అందరి సహాయ సహకారాలు కావాలన్నారు. ఇకపై అభిమానులతో గ్యాప్ ఉండదని ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

**చిరు వ్యాఖ్యలపై పొలిటికల్ బజ్!**

మెగా యూత్ ఫోర్స్ మరింత బలోపేతం చేయాలని అభిమానుల కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామంటూ చిరంజీవి చేసిన వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తమిళనాడులు సినీ రంగం నుంచి వచ్చిన విజయ్ సీఎం అయ్యాక సినీ ఇండస్ట్రీకి చెందిన పలువురు యాక్టర్లు రాజకీయరంగం వైపు ఫోకస్ పెట్టినట్లు వార్తలు వస్తున్నాయి. ఇందుకోసం ఇప్పటి నుంచే అభిమాన సంఘాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించినట్లు చర్చలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో చిరంజీవి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లోను హాట్ టాపిక్ అవుతున్నాయి. నిజానికి రాజకీయంగా యాక్టివ్ గా లేకపోయినా చిరంజీవి తమ పార్టీ సభ్యుడేనంటూ కాంగ్రెస్ క్లెయిమ్ చేసుకుంటోంది. ఇక ఏపీ రాజకీయాల్లో తన సోదరుడు, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా ప్రభుత్వంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'మెగా యూత్ ఫోర్స్' మరింత బలోపేతం కావాలంటూ చిరంజీవి చేసిన వ్యాఖ్యలు కేవలం అభిమాన వరకే ఉంటుందా లేక చిరంజీవి భవిష్యత్‌లో రాజకీయంగా ఏదైనా ప్లాన్ చేస్తున్నారా అనేది కాలమే నిర్ణయించనుంది.

# దసరా కానుకగా కొత్త పెన్షన్ల పంపిణీ

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే శుభవార్త చెప్పనుంది. రాబోయే దసరా పండుగను పురస్కరించుకుని నూతన పింఛన్ల పంపిణీని పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో అర్హులైన పేదలకు దసరా పండుగ కానుకగా కొత్త పెన్షన్లను అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా అక్టోబర్ నెలలోనే కొత్త పింఛన్ల పంపిణీని ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. పండుగ నాటికి లబ్ధిదారుల చేతికి పెన్షన్లు అందేలా అధికార యంత్రాంగం వేగంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

**అదనపు సిబ్బంది నియామకం..**

పెన్షన్ ఎంపిక ప్రక్రియలో పారదర్శకత ఉండేలా క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించే బాధ్యతను సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ కు అప్పగించారు. వెరిఫికేషన్‌లో ఎక్కడైనా సిబ్బంది కొరత ఏర్పడితే, తక్షణమే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. ఎలాంటి జాప్యానికి తావులేకుండా ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు.

**ఒంటరి మహిళలు, వితంతువులకు పెద్దపీట**

కొత్త పెన్షన్ల మంజూరులో భాగంగా సమాజంలో అత్యంత ఆదరణకు నోచుకోని వర్గాలకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోంది. ముఖ్యంగా పూర్తి స్థాయిలో అర్హత కలిగిన ఒంటరి మహిళలు, వితంతువులకు ఈ విడతలో మొదటి ప్రాధాన్యత కింద పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించారు. వీరికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి వెల్లడించారు. పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న ఏ ఒక్కరూ నష్టపోకూడదని, ప్రతి అర్హునికి పెన్షన్ అందేలా అధికార యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తేల్చిచెప్పారు.







# హైదరాబాద్ లో సిద్ శ్రీరామ, పూర్బయన్ చటర్జీలతో ఫెడరల్ బ్యాంక్ భారత్ సురోత్సవ్ సీజన్ 2

**హైదరాబాద్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

సమకాలిన సంచలనం సిద్ శ్రీరామ్, సితార్ మాస్ట్రో పూర్బయన్ చట్టర్జిలు వేదికను పంచుకోవడంతో, రెండు విభిన్న సంగీత ప్రపంచాలను ఒక చోట చేర్చిన ఫెడరేల్ బ్యాంక్ భారత్ సురోత్సవ్ సీజన్ 2, హైటెక్ సిటీ శిల్పకళావేదికలో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి సంగీత ప్రియుల నుండి అద్భుతమైన స్పందన లభించింది. భారతీయ కళల వైవిధ్యాన్ని చాటి చెప్పడానికి, విభిన్న సంగీత సాంప్రదాయాలకు చెందిన కళాకారులను ఒకచోట చేర్చడానికి ఫెడరల్ బ్యాంక్ యొక్క సొంత మేధో సంపత్తిగా రూపొందించబడిన భారత సురోత్సవ్, జంట నగరాలలో ఒక ప్రత్యేకమైన సంగీత అనుభవంతో తన ప్రయాణ ప్రయాణాన్ని కొనసాగించింది. ఈ కార్యక్రమాన్ని ఫెడరల్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఌ సీఈఓ అయిన కె. వి. ఎస్ మణీయన్ మరియు హైదరాబాద్ జోనల్ హెడ్ అయినా మనీష్ నరేష్ షా లాంఛనంగా ప్రారంభించి, పాల్గొన్న దిగ్గజాలను మరియు కళాకారులను సత్కరించారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

## సీఎం చేతకానితనం వల్లే రిమ్స్ ప్రమాదం

**ఆదిలాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రి ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి ముగ్గురు చిన్నారులు మృతిచెందడం అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. ఈ ప్రమాదంలో మరో 23 మంది చిన్నారులు గాయపడ్డారని, వారికి వెంటనే మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఘోర వైఫల్యం వల్లే ఇంత పెద్ద ప్రమాదం జరిగిందని మండిపడ్డారు. అభంశుభం తెలియని పిల్లలు అన్యాయంగా బలైపోయారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ వైద్య రంగాన్ని రేవంత్ రెడ్డి పూర్తిగా విధ్వంసం చేశారని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఈ సంఘటనకు ఆయనే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రిమ్స్ ఆస్పత్రిలో నెలకొన్న దుస్థితులపై అనేకసార్లు జిల్లా స్థాయి బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారని తెలిపారు. అయినా మొద్దు నిద్ర వీడని రేవంత్ సర్కార్‌లో కనీస చలనం కనిపించలేదన్నారు. అత్యంత పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన పిల్లల వార్డులో ప్రభుత్వ పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని ఆరోపించారు. కనీస నిర్వహణ లేకపోవడం వల్లే ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుందని కేటీఆర్ ఆగ్రహించారు. ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని పిల్లల వార్డులు, ఐసీయూలను వెంటనే నిపుణులతో తనిఖీ చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. రేవంత్ సర్కార్ చేతకానితనం వల్ల పిల్లలను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతి కుటుంబానికీ రూ. 25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున కేటీఆర్ డిమాండ్ చేశారు.

## నల్లగొండ రూపురేఖలు మార్చేస్తాం !

**నల్లగొండ,ఫ్లాష్ ఇండియా :** నల్లగొండ నగర రూపురేఖలను పూర్తిగా మార్చి, అన్ని మౌలిక సదుపాయాలతో స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. బెస్ట్ కార్పొరేషన్ అవార్డు సాధించడమే లక్ష్యంగా నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. మంగళవారం నల్లగొండలోని శాంతి కళ్యాణ మండపం వద్ద మీడియాతో మాట్లాడారు. నగరంలో 24 గంటల తాగునీటి సరఫరా కోసం రూ. 83 కోట్లతో టెండర్లు పిలిచినట్లు మంత్రి వెల్లడించారు. 63 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని తెలిపారు. ఎస్టీపీ నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తామని, నగర ప్రజల అవసరాల కోసం రూ. 1.01 కోట్లతో రెండు వెండింగ్ మెషీన్ల కొనుగోలుకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇటీవల స్వచ్ఛతా అవార్డు రావడం గర్వకారణమన్నారు. పరిశుభ్రత, పచ్చదనం, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర రంగాల్లో సమగ్ర అభివృద్ధి చేపట్టి నల్లగొండను పరిశుభ్రమైన, హరిత నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. నగరానికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే దిశగా రూ. 900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు శాశ్వత పరిష్కారాలు అందించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో నల్లగొండను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, కమిషనర్ వంశీకృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అరెస్ట్

**జడ్చర్ల,ఫ్లాష్ ఇండియా :** జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టిన ఆయకట్టు రైతులకు సంఘీభావం తెలిపేందుకు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు బయలుదేరారు. కాగా ఆయన్ను పోలీసులు జడ్చర్ల సమీపంలో మార్గమధ్యంలోనే అడ్డుకుని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల చర్యను రాంచందర్ రావు తీవ్రంగా ఖండిస్తూ, ఇది ముమ్మాటికీ రేవంత్ రెడ్డి సర్కారు నిరంకుశత్వానికి, అప్రజాస్వామిక పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. పంటలు ఎండిపోతున్నాయన్న బాధతో రోడ్డెక్కిన అన్నదాతల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు వెళ్తుంటే ప్రతిపక్ష నేతలను మార్గమధ్యంలోనే నిర్బంధించడం ప్రభుత్వ దౌర్జన్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు. రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిందిపోయి, అధికార మదంతో ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని ఆయన విమర్శించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ఇలాంటి అక్రమ అరెస్టులు చేసినంత మాత్రాన ప్రజా పోరాటాలను ఆపలేరని హెచ్చరించారు. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడుతుందని, అన్నదాతల హక్కుల సాధన కోసం క్షేత్రస్థాయిలో పోరాడుతూనే ప్రభుత్వాన్ని నిలదీస్తామని తేల్చిచెప్పారు. జూరాల ఆయకట్టు ఎండిపోకుండా తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని, అక్రమంగా నిర్బంధించిన బీజేపీ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# నీటి విడుదలకు ప్రభుత్వం ప్లాన్..!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జూరాల ప్రాజెక్టు నుంచి పంటలకు నీటి విడుదల చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ కసరత్తు చేస్తోంది. పంటలకు దశలవారీగా నీటిని విడుదల చేయడానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలోనే జూరాల నుంచి నీటి విడుదల అంశంపై మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జి. మధుసూదన్ రెడ్డిలు సెక్రటేరియేట్‌లో ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రితో కీలక సమావేశం నిర్వహించి సంప్రదింపులు జరిపారు. జూరాలకు నీటి ప్రవాహం పెంచేందుకు కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో స్వయంగా మాట్లాడి, నీటిని విడుదల చేయాలని కోరాలని మంత్రులు నిర్ణయించారు. పంటలకు ఎలాంటి నష్టం కలగకుండా, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. ఎల్‌నినో వంటి తీవ్ర కరువు పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాల్సింది పోయి, ప్రతిపక్షాలు కేవలం తమ స్వార్థ రాజకీయాల కోసం అన్నదాతలను అనవసరంగా రెచ్చగొడుతున్నాయని ప్రభుత్వం విమర్శించింది. తమది ప్రజా ప్రభుత్వమని, రైతాంగానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పష్టం చేస్తూ, సాగు, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని తెలిపింది. మరోవైపు, రైతులకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నిరసన చేపట్టింది. ఈ మేరకు జూరాల పర్యటనకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్‌రావు బయలు దేరారు. దీంతో పోలీసులు జడ్చర్ల బ్లూ ఫాక్స్ హోటల్ వద్ద ఆయనను అడ్డుకొని అరెస్ట్ చేశారు. జడ్చర్లకు తరలించారు. ఇప్పటికే ఆత్మకూరు, అమరచింత గద్వాలలో బీజేపీ, సీపీఐ, సీపీఎం నేతల ముందస్తు అరెస్టులు చేపట్టారు. జూరాల కు వెళ్ళే మార్గాల్లో మూడంచెల బందోబస్త్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్‌రావు అరెస్ట్‌ను నిరసిస్తూ జడ్చర్ల నేషనల్ హైవేపై బీజేపీ శ్రేణులు బైఠాయించారు. పోలీసులకు బీజేపీ శ్రేణులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కాగా.. నిరసన తెలుపుతున్న రైతులకు మద్దతుగా జూరాలకు వెళ్తుండగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని జడ్చర్ల వద్ద అరెస్టు చేయడాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. "రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులను కలవడం, వారి సమస్యలపై గళమెత్తడం కూడా అరెస్టుకు కారణమవుతోంది. కాంగ్రెస్ పార్టీ నాటి ఎమర్జెన్సీ మనస్తత్వానికి ఇది నిదర్శనం. విమర్శలను అణచివేయడం, అన్నదాతల తరఫున మాట్లాడేవారి గొంతు నొక్కడం, ప్రజల ఆవేదన వినిపించకుండా చేయడమే వారి విధానం. రేవంత్ రెడ్డి రైతులకు అండగా నిలిచేవారిని అరెస్టు చేస్తుంటే, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ మాత్రం మన అన్నదాతలకు అమలుకాని తప్పుడు హామీలు ఇస్తూనే ఉన్నాయి." అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో కుండపోత వర్షం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు.

**సమన్వయంతో పనిచేయాలని సూచన..**

హైదరాబాద్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హైడ్రా , పోలీసు కమిషనర్లు కో-ఆర్డినేషన్‌తో పనిచేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం సూచించారు. నగరంలో వర్షం కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే స్పందించేలా యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలన్నారు. ప్రధాన రహదారులు, జంక్షన్లు, కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, నీరు నిలిచిన ప్రాంతాల్లో వెంటనే సిబ్బందిని, యంత్రాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. అదేవిధంగా లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నాలాలు, డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను సూచించారు.

**విద్యుత్, ట్రాఫిక్ నివారణకు ముందస్తు చర్యలు**

నగరంలో వర్షం వేళ విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. అలాగే వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ జామ్‌లను నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎమర్జెన్సీలో తక్షణమే స్పందించేందుకు సహాయక బృందాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని, కంట్రోల్ రూమ్‌లు నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# రేవంత్ రెడ్డిపై ఈటల ఫైర్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైదరాబాద్‌లో భూములను ఎలా కొల్లగొట్టాలి, ఎలా డబ్బులు సంపాదించుకోవాలనే యావ తప్ప.. తెలంగాణ రైతులు, కరెంట్ సమస్యలపై కనీస అవగాహన లేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ పాత రోజులు వచ్చాయని, సెప్టెంబర్ నెలలోనే పంటలు ఎండిపోయి కరెంట్ కోసం రైతులు సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు చేసే పరిస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఖైరతాబాద్‌లో ఇంజినీర్లతో కలిసి ఈటల మీడియాతో మాట్లాడారు.

**అప్రమత్తం చేస్తే మాపైనే ఎదురు దాడి:**

ఎల్ నినో ప్రభావంతో తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ముందస్తు చర్యలు తీసుకోవాలని తాము హెచ్చరిస్తే.. ప్రభుత్వం తమపైనే ఎదురుదాడికి దిగిందని ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డను బూచిగా చూపి గోదావరి నీళ్లను ఎత్తిపోయకపోవడం వల్లే అనేక జిల్లాలు ఎడారిగా మారే ప్రమాదం వచ్చిందన్నారు. కేసీఆర్‌పై ఉన్న కోపంతో రేవంత్ రెడ్డి రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. కళ్లముందే నీళ్లు ఉన్నా, మేడిగడ్డ నుంచి 650 టీఎంసీల నీరు సముద్రం పాలైనా ఎల్లంపల్లికి లిఫ్ట్ చేయకపోవడం రేవంత్ రెడ్డి అజ్ఞానానికి, రైతులపై ఉన్న ద్వేషానికి నిదర్శనమని నిలదీశారు. రిటైర్డ్ ఇంజనీర్లు సైతం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించేందుకు ప్రయత్నించినా ప్రభుత్వం వారి సూచనలను పట్టించుకోలేదన్నారు.

**ఆంధ్రప్రదేశ్‌తో కుమ్మక్కు ఆరోపణలు:**

కృష్ణానదిపై తెలంగాణకు హక్కులు ఉన్నప్పటికీ ఏపీ నీటిని తరలించుకుపోతోందని, సీఎం రేవంత్ రెడ్డి ఏపీ ప్రభుత్వంతో కుమ్మక్కై తెలంగాణ పంట పొలాలను ఎండబెట్టి రాయలసీమకు నీళ్లు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారా అని ప్రజలు గమనించాలని సూచించారు. జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వకపోవడంతో రైతులే స్వయంగా గేట్లు ఎత్తే పరిస్థితి వచ్చిందంటే ప్రభుత్వం ఎంత నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తుందో అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో 24 గంటల కరెంట్ దేవుడెరుగు, కనీసం 7 నుంచి 8 గంటలు కూడా రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు. లో-వోల్టేజీ కరెంట్ వల్ల రైతుల బోర్లు పాడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఎల్ నినో పేరు చెప్పి కేంద్రానికి లేఖలు రాయడమే తప్ప, చేతిలో ఉన్న నీళ్లను రైతులకు అందించకుండా పిచ్చిపనులు చేయడం మానుకోవాలని, ఇప్పటికైనా వర్షాకాలంలో పంటలు వేసుకున్న రైతులకు తక్షణమే నీళ్లు విడుదల చేయాలని ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**ఎగువ రాష్ట్రాల్లో నిండుకుండలుగా ప్రాజెక్టులు:**

కృష్ణా నదిపై ఉన్న జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వకపోవడంతో రైతులే స్వయంగా వచ్చి గేట్లు తెరుస్తామని చెప్పే పరిస్థితి వచ్చిందని ఈటల అన్నారు. ఇంతటి ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ మహారాష్ట్ర, కర్ణాటకలోని ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయని తెలిపారు. మన వద్ద మాత్రం నీరు పారుతున్నా ఎత్తిపోయలేదని దుయ్యబట్టారు. భవిష్యత్‌లో తాగునీటి అవసరాల కోసం ఎగువ రాష్ట్రాల ప్రభుత్వాలతో మాట్లాడుకుని నీటిని తెచ్చుకునే పరిస్థితి వచ్చినా.. ప్రస్తుతం కళ్లముందే నీళ్లు ఉన్నప్పటికీ తెలంగాణ రైతుల పంటలను ఎండబెడుతున్నారని విమర్శించారు. నీళ్లు అందుబాటులో ఉన్నా రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. వానాకాలంలో పంటలు ఎడిపోకుండా రైతులకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# శోభాయాత్రకు సన్నాహాలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఖైరతాబాద్ శ్రీ పంచముఖ సంకటహర మహాగణపతి నిమజ్జనానికి అధికారులుఏర్పాట్లుముమ్మరంచేశారు. భారీగణపతినిమజ్జన ట్రయల్స్ నిర్వహించి శోభాయాత్ర మార్గంలో ఎదురయ్యే ఇబ్బందులను గుర్తించారు. పోలీసులతో పాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ట్రాఫిక్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు. గణపతి విగ్రహం పొడవు, వెడల్పును బేరీజు వేసుకుంటూ అధికారులు నిమజ్జన మార్గాన్ని పరిశీలించారు. మార్గంలో కొన్ని చెట్లు, విద్యుత్ వైర్లు, కటౌట్లు, కేబుల్ వైర్లు, విద్యుత్ లైట్లు అడ్డుగా ఉన్నట్లు గుర్తించారు. వీటిని ఈ నెల 24లోగా తొలగించి మార్గాన్ని సురక్షితంగా సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

**శుక్రవారం ఉదయం 6 గంటలకు శోభాయాత్ర..**

శుక్రవారం ఉదయం 6 గంటలకు ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 12 గంటల్లోపు ఎన్టీఆర్ మార్గంలోని క్రేన్ నంబర్ 5 వద్ద నిమజ్జనం పూర్తి చేయాలని పోలీసులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు అనుగుణంగా శోభాయాత్ర మార్గాన్ని అధికారులు ఖరారు చేశారు.

**బుధవారం అర్ధరాత్రి వరకే దర్శనాలు..**

మహాగణపతిని దర్శించుకునేందుకు భక్తులకు బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం నుంచి భక్తులను దర్శనాలకు అనుమతించబోమని స్పష్టం చేశారు. నిమజ్జన ఏర్పాట్ల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్ల డించారు.. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నాయి

# చదువుతోనే జీవితాలు మారుతాయి..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం-1989పై రాష్ట్ర స్థాయి ఉన్నతస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న జరిగిన చివరి సమావేశం తర్వాత, రాష్ట్రంలో పూర్తిస్థాయిలో నిర్వహించిన తొలి రాష్ట్ర స్థాయి ఉన్నతస్థాయి సమావేశం ఇదే కావడం గమనార్హం. ఈ సమావేశంలో ఎస్సీ, సంక్షేమ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**బాధితులకు సత్వర న్యాయం..**

ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో చూస్తోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బాధితులకు సత్వర న్యాయం, నష్టపరిహారం, పునరావాసం అందేలా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 2023 నుంచి ఇప్పటివరకు మొత్తం 7,563 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కేసులు నమోదయ్యాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. అనంతరం బాధితులకు అందజేసే నష్టపరిహారాన్ని బడ్జెట్‌తో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానల్ ద్వారా సత్వరమే విడుదల చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇక రాష్ట్రంలో నమోదైన కేసులు, దర్యాప్తు, విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న ఆర్థిక సహాయంపై సీఎం స్వయంగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరు, చట్టంపై అవగాహన కార్యక్రమాలపై కూలంకషంగా సమీక్ష నిర్వహించారు.

**గత ప్రభుత్వంపై మంత్రి అడ్లూరి తీవ్ర విమర్శలు**

దళితులు కోరుకునేది ఆత్మగౌరవం, సమానత్వం, భద్రత అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్--మానిటరింగ్ సమావేశాన్ని ఒక్కసారి కూడా ఎందుకు నిర్వహించలేదని ఆయన ప్రశ్నించారు. దళితులపై దాడులు, అత్యాచారాలు, వేధింపుల విషయంలో గత పాలకులు తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. ఇటీవల దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా జరిగిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన మంత్రి, ఈ ఘటనపై రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకునేలా సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లుగా అడ్లూరి తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట**

ఇందిరమ్మ స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇందిరాగాంధీ హయాంలో 25 లక్షల ఎకరాలకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత కాంగ్రెస్‌దేనని గుర్తుచేశారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో 31 శాతం దళితులకు, 17 శాతం ఎస్టీలకు కేటాయించినట్లు తెలిపారు. తెలంగాణలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. అలాగే 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లుగా వెల్లడించారు.

**హాస్టళ్లలో మెస్ చార్జీలు..**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లకు ప్రతి నెల మొదటి వారంలోనే కాస్మోటిక్ ఛార్జీలు, మెస్ ఛార్జీలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లుగా మంత్రి అడ్లూరి తెలిపారు. చదువొక్కటే జీవితాలను సమూలంగా మార్చగలదని, అట్టడుగు వర్గాలను విద్య వైపు నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. పిల్లలను చదువుతో పాటు క్రీడల వైపు కూడా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకెళ్తామని, ఈ ప్రభుత్వం మీది.. మీకోసమే పనిచేస్తుందని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు.

## సంపాదకీయం



# రాజకీయ అనిశ్చితికి సంకేతమా?

తెలంగాణ రాజకీయాల్లో దానం నాగేందర్ వ్యవహారం ఇప్పుడు ఒక ఎమ్మెల్యే అనర్హతకు సంబంధించిన న్యాయపరమైన అంశాన్ని దాటి, పార్టీ ఫిరాయింపులు, ప్రజా విశ్వాసం, రాజకీయ నిర్ణయాల్లో స్థిరత్వం, ఉపఎన్నికల ప్రభావం వంటి అనేక ప్రశ్నలను ముందుకు తెస్తోంది. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేసిన దానం నాగేందర్ సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడు. అయితే 2023లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరడం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం రాజకీయంగా, న్యాయపరంగా చర్చకు దారితీసింది. ఇటీవల తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పు ఇవ్వడంతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. హైకోర్టు తీర్పు అనంతరం ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కింది కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేయడం రాజ్యాంగబద్ధమైన న్యాయపరమైన మార్గమే. అందువల్ల సుప్రీంకోర్టుకు వెళ్లడాన్ని ఒక్క కారణంతో, ముఖ్యంగా రాజకీయ భయంతోనే ముడిపెట్టడం సరైన విశ్లేషణ కాదు. అయితే రాజకీయంగా మాత్రం మరో ప్రశ్న ముందుకు వస్తోంది. హైకోర్టు తీర్పు అనంతరం తాను మళ్లీ ప్రజల్లోకి వెళ్లి ఎన్నికల్లో పోరాడతానని దానం నాగేందర్ ప్రకటించడం, అనంతరం సుప్రీంకోర్టును ఆశ్రయించడం చర్చకు దారితీసింది. ఒక సందర్భంలో రాజకీయ పోరాటం గురించి ధైర్యంగా మాట్లాడి, మరొక సందర్భంలో న్యాయపరమైన ఉపశమనాన్ని కోరడం పరస్పర విరుద్ధంగా కనిపిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే దీనిని “ఓటమి భయం”గా నిర్ధారించడం కంటే, ఒక నాయకుడి రాజకీయ ప్రకటనలు మరియు న్యాయపరమైన వ్యూహాల మధ్య ఉన్న వ్యత్యాసంగా చూడటం సముచితం. ఇక్కడ అసలు చర్చ దానం నాగేందర్ వ్యక్తిగత నిర్ణయాలకంటే పెద్దది. ఒక పార్టీ గుర్తుపై గెలిచిన ప్రజాప్రతినిధి మరో పార్టీలో చేరితే, ఆ నిర్ణయానికి ప్రజల ముందు ఎంతవరకు జవాబుదారీగా ఉండాలి? అనే ప్రశ్న. ఓటరు అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్ఠను మాత్రమే చూసి ఓటు వేయడు. పార్టీ గుర్తు, పార్టీ విధానం, స్థానిక నాయకత్వం, ప్రభుత్వ పనితీరు వంటి అంశాలు కూడా ఎన్నికల్లో ప్రభావం చూపుతాయి. అందువల్ల పార్టీ ఫిరాయింపులు జరిగినప్పుడు ప్రజా ప్రతినిధి తన నిర్ణయాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఏర్పడుతుంది. అదే సమయంలో చట్టపరంగా తనకు అందుబాటులో ఉన్న మార్గాలను ఉపయోగించుకునే హక్కు కూడా ఆయనకు ఉంటుంది. ఈ రెండు అంశాలను వేర్వేరుగా చూడాలి. దానం నాగేందర్ వ్యవహారంలో 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కూడా రాజకీయ చర్చలోకి వచ్చాయి. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి 73,664 ఓట్లు, దానం నాగేందర్‌కు 57,124 ఓట్లు వచ్చాయి. అంటే కిషన్‌రెడ్డికి 16,540 ఓట్ల ఆధిక్యం లభించింది. అయితే లోక్‌సభ ఎన్నికల ఫలితాలను భవిష్యత్తు అసెంబ్లీ ఉపఎన్నిక ఫలితానికి నేరుగా అన్వయించడం సరైంది కాదు. ఎన్నికల స్వభావం, అభ్యర్థులు, ప్రచార అంశాలు, రాజకీయ పరిస్థితులు వేర్వేరుగా ఉంటాయి. ఒకవేళ ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక జరిగితే అది కేవలం దానం నాగేందర్ వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన పోటీగా ఉండదు. పార్టీ ఫిరాయింపులపై ప్రజల స్పందన, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, బీఆర్ఎస్ రాజకీయ పునరుద్ధరణ, బీజేపీ స్థానిక బలం, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం వంటి అనేక అంశాలు ఆ ఎన్నికలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో దానం నాగేందర్ గత రాజకీయ ప్రయాణం కూడా చర్చకు వస్తోంది. 2004లో ఆసిఫ్‌నగర్ నుంచి టీడీపీ తరఫున గెలిచిన అనంతరం కాంగ్రెస్‌లో చేరడం, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి కాంగ్రెస్ తరఫున పోటీ చేయడం వంటి పరిణామాలు ఆయన రాజకీయ జీవితంలో పార్టీ మార్పులు కొత్త విషయం కాదనే చర్చకు కారణవవుతున్నాయి. అయితే ప్రతి రాజకీయ సందర్భాన్ని దాని కాలం, పరిస్థితులు, రాజకీయ నేపథ్యంతోనే విశ్లేషించాలి. ఈ వ్యవహారం కాంగ్రెస్‌కు కూడా ఒక ప్రశ్నను ముందుకు తెస్తోంది. పార్టీ ఫిరాయింపులపై గతంలో కాంగ్రెస్ చేసిన విమర్శలు, ఇప్పుడు తన పార్టీలో చేరిన ప్రజాప్రతినిధుల విషయంలో అనుసరిస్తున్న రాజకీయ వైఖరి---ఇవన్నీ ప్రజలు పోల్చి చూసే అవకాశం ఉంది. అదే విధంగా బీఆర్ఎస్ కూడా ఫిరాయింపులపై న్యాయపోరాటం చేయడంతో పాటు, తన పార్టీ నుంచి ఇతర పార్టీలకు వెళ్లిన నాయకుల విషయంలో ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ కార్యక్రమాన్ని వివరించాల్సిన అవసరం ఉంది. దానం నాగేందర్ అసెంబ్లీ జీరో అవర్‌లో “ఏం జరిగినా యుద్ధం చేస్తాం.. పోరాటం చేస్తాం” అంటూ చేసిన వ్యాఖ్యలు కూడా ఇప్పుడు చర్చలోకి వచ్చాయి. అదే రోజు ఆయనపై హైకోర్టు తీర్పు రావడంతో, ఆ వ్యాఖ్యలను కొందరు రాజకీయంగా అన్వయిస్తున్నారు. అయితే తీర్పు ముందుగానే తనకు తెలుసని నిర్ధారించే ఆధారం లేకుండా ఆ వ్యాఖ్యలకు అలాంటి ఉద్దేశాన్ని ఆపాదించడం సరైంది కాదు. మొత్తానికి దానం నాగేందర్ వ్యవహారం తెలంగాణ రాజకీయాలకు ఒక ముఖ్యమైన సామాజిక ప్రశ్నను ముందుకు తెస్తోంది. ప్రజాప్రతినిధి పార్టీ మారినప్పుడు, ప్రజల విశ్వాసానికి అతని బాధ్యత ఏమిటి? అదే సమయంలో న్యాయపరమైన హక్కులను వినియోగించుకునే స్వేచ్ఛ ఎంతవరకు ఉంటుంది? రాజకీయ పోరాటం, న్యాయపోరాటం రెండూ పరస్పర విరుద్ధమైనవేనా? అనే ప్రశ్నలకు సమాధానం కూడా అవసరం. నాయకులు పార్టీలు మార్చవచ్చు. న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఎన్నికల్లో మళ్లీ పోటీ చేయవచ్చు. రాజకీయ వ్యూహాలను మార్చుకోవచ్చు. కానీ ప్రజల తీర్పును ముందుగానే ఎవరూ నిర్ణయించలేరు. అందుకే దానం నాగేందర్ వ్యవహారాన్ని కేవలం “ఓటమి భయం” అనే కోణంలో చూడటం కంటే, తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపులు ప్రజా విశ్వాసాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయి, రాజకీయ నాయకులు తమ నిర్ణయాలకు ప్రజల ముందు ఎంతవరకు జవాబుదారీగా ఉంటున్నారు అనే విస్తృత సామాజిక కోణంలో చూడాల్సిన అవసరం ఉంది. చివరికి కోర్టులు న్యాయపరమైన ప్రశ్నలకు సమాధానం చెబుతాయి. పార్టీలు రాజకీయ వాదనలు వినిపిస్తాయి. కానీ ఒక నాయకుడి రాజకీయ నిర్ణయానికి ప్రజల అంగీకారం ఉందా లేదా అన్నది మాత్రం ప్రజల తీర్పే నిర్ణయిస్తుంది.

# రాజకీయ సమరానికి మరో వేదికా?

తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్--బీఆర్ఎస్ మధ్య పోరు మరోసారి వేడెక్కుతోంది. అసెంబ్లీ వేదికగా మొదలైన ఆరోపణలు, ప్రత్యారోపణలు ఇప్పుడు నేరుగా నియోజకవర్గాల గడ్డపైకి వస్తున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటలను కాంగ్రెస్ రాజకీయంగా లక్ష్యంగా చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. సెప్టెంబర్ 30న సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తుండగా, అక్టోబర్ మొదటి వారంలో సిద్దిపేటలోనూ సభ నిర్వహించే యోచన ఉన్నట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. ఇది సాధారణ రాజకీయ సభల పరంపరగా చూడాల్సిన అంశం కాదు. తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఆధిపత్య పోరు ఏ స్థాయికి చేరిందో ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీకి బలమైన నియోజకవర్గాల్లో సభలు నిర్వహించడం ద్వారా అక్కడి రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేయాలన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. అయితే రాజకీయంగా ఒక నియోజకవర్గాన్ని లక్ష్యంగా చేసుకోవడం వేరు.. అక్కడి ప్రజల సమస్యలను పరిష్కరించడం వేరు. ఈ రెండింటి మధ్య గీత చెరిగిపోకూడదు. సిరిసిల్లకు ప్రత్యేకమైన రాజకీయ ప్రాధాన్యత ఉంది. కేటీఆర్ 2009 నుంచి ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2023 ఎన్నికల్లో కూడా ఆయన బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచారు. ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం 2023లో కేటీఆర్‌కు 89,244 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డికి 59,557 ఓట్లు వచ్చాయి. మెజారిటీ 29,687 ఓట్లు. అందువల్ల సిరిసిల్లలో కాంగ్రెస్ భారీ సభ నిర్వహించడం కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు; దాని వెనుక స్పష్టమైన రాజకీయ సందేశం కూడా ఉంది. బీఆర్ఎస్‌కు బలమైన ప్రాంతంలో అధికార పార్టీ తన శక్తిని ప్రదర్శించాలనుకోవడం సహజమే. అదే సమయంలో బీఆర్ఎస్‌కు కూడా సిరిసిల్ల కేవలం ఒక నియోజకవర్గం కాదు. పార్టీ రాజకీయ భవిష్యత్తులో కేటీఆర్ పాత్ర, ఆయనకు ఉన్న ప్రజా మద్దతు, బీఆర్ఎస్ కేడర్ బలం వంటి అంశాలకు ఈ నియోజకవర్గం ఒక ప్రతీకగా మారింది. అందుకే సెప్టెంబర్ 30న జరిగే సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడతారన్నదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరుగుతోంది.

### ఆరోపణల రాజకీయానికి కేంద్రంగా భూములు

ప్రస్తుతం కాంగ్రెస్--బీఆర్ఎస్ మధ్య ప్రధాన రాజకీయ ఆయుధాల్లో భూవివాదాలు ఒకటిగా మారాయి. అసెంబ్లీలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబానికి సంబంధించిన భూములపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నలు లేవనెత్తగా, బీఆర్ఎస్ నేతలు కూడా సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన భూములు, ఆస్తులపై ఆరోపణలు చేస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో భూములపై ప్రభుత్వం విచారణకు ఆదేశించినట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు బీఆర్ఎస్ నేతలు ఇరుపక్షాల ఆస్తులపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇది రాజకీయంగా ఎంత తీవ్రమైన అంశమైనా, ప్రజాస్వామ్యపరంగా చూస్తే అసలు ప్రశ్న ఒక్కటే ఆరోపణలకు ఆధారాలున్నాయా? ఒక ప్రభుత్వం ప్రతిపక్ష నేతపై ఆరోపణ చేస్తే దానికి అధికారిక రికార్డులు, సర్వే నంబర్లు, భూమి బదలాయింపు వివరాలు, సంబంధిత ఉత్తర్వులు వంటి ఆధారాలు ప్రజల ముందుకు రావాలి. ప్రతిపక్షం ఆరోపణలను ఖండిస్తే, కేవలం రాజకీయ ప్రసంగంతో సరిపెట్టకుండా వాస్తవ పత్రాలతో సమాధానం ఇవ్వాలి. ఇటీవల సిరిసిల్లకు సంబంధించి 8 వేల ఎకరాల భూముల వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. దీనిపై బీఆర్ఎస్ నేతలు కూడా ప్రశ్నలు లేవనెత్తుతూ విచారణకు సవాళ్లు విసురుతున్నారు. తెలంగాణ అసెంబ్లీలో భూముల అంశంపై ఇరుపక్షాల మధ్య వాదోపవాదాలు ఇప్పటికే తీవ్ర రూపం దాల్చాయి. ఇలాంటి సందర్భంలో సిరిసిల్ల సభ మరింత ప్రాధాన్యత సంతరించుకుంటోంది.

### సభలో ఆరోపణలకే ప్రాధాన్యతా?

రాజకీయ సభ అనేది ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్యమైన సాధనం. అధికార పార్టీ తన పనితీరును ప్రజలకు వివరించవచ్చు. ప్రతిపక్షం ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపవచ్చు. ప్రజలు ఇరుపక్షాల వాదనలు విని తమ అభిప్రాయాన్ని ఏర్పరుచుకోవచ్చు. కానీ సభలు కేవలం ప్రత్యర్థిపై వ్యక్తిగత విమర్శలు చేయడానికి వేదికలుగా మారితే ప్రజాస్వామ్య చర్చ నాణ్యత తగ్గుతుంది. సిరిసిల్ల సభలో ప్రభుత్వం గత పాలనలో జరిగినట్లు ఆరోపిస్తున్న భూవ్యవహారాలపై మాట్లాడితే, అదే సమయంలో ప్రస్తుతం సిరిసిల్లకు ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు ఏమిటో కూడా వివరించాలి. చేనేత, పవర్‌లూమ్ రంగానికి ఎలాంటి సహాయం అందుతోంది? ఉపాధి అవకాశాల పరిస్థితి ఏమిటి? యువతకు ప్రభుత్వం ఏం చేస్తోంది? సాగునీరు, రహదారులు, పారిశ్రామిక మౌలిక వసతులపై ఎలాంటి చర్యలు తీసుకుంది? ఇవన్నీ ప్రజలకు వివరించాల్సిన అంశాలే. అదే విధంగా బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ ఆరోపణలను ఖండించడమే కాకుండా, సిరిసిల్లలో గతంలో తాము చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై వాస్తవ గణాంకాలతో మాట్లాడాలి. తమపై వచ్చిన భూ ఆరోపణలకు సంబంధించి ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలి. అప్పుడే ఈ రాజకీయ పోరు ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య చర్చగా మారుతుంది.

### కాంగ్రెస్ వ్యూహం.. బీఆర్ఎస్‌కు సవాలా?

సిరిసిల్ల తర్వాత సిద్దిపేటలో సభ నిర్వహించే ఆలోచన కూడా రాజకీయంగా గమనించాల్సిన పరిణామం. ఈ రెండు నియోజకవర్గాలు బీఆర్ఎస్ రాజకీయ చరిత్రలో కీలకమైనవి. అందువల్ల అక్కడ అధికార కాంగ్రెస్ భారీ సభలు నిర్వహించడం ద్వారా బీఆర్ఎస్ బలాన్ని నేరుగా సవాలు చేయాలనుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఇది కేవలం కేడర్‌ను ఉత్తేజపరిచే కార్యక్రమం మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ పోరాటానికి కాంగ్రెస్ ముందస్తు వ్యూహాన్ని రూపొందిస్తోందన్న చర్చకు కూడా కారణమవుతోంది. అయితే ప్రత్యర్థి నియోజకవర్గంలో భారీ సభ నిర్వహించినంత మాత్రాన అక్కడి రాజకీయ సమీకరణాలు మారిపోతాయని చెప్పలేం. ప్రజల రాజకీయ అభిప్రాయాలను నిర్ణయించేది సభల పరిమాణం మాత్రమే కాదు. స్థానిక నాయకత్వం, ప్రభుత్వ పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారం, అభ్యర్థులపై నమ్మకం, స్థానిక రాజకీయ పరిస్థితులు వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి. అందువల్ల సిరిసిల్లలో కాంగ్రెస్ సభ విజయవంతమవడం ఒక రాజకీయ సందేశం కావచ్చు. కానీ దాని ప్రభావాన్ని అంచనా వేయడానికి మరింత విస్తృతమైన రాజకీయ, సామాజిక పరిణామాలను చూడాల్సి ఉంటుంది.

### బీఆర్ఎస్‌కు కూడా బాధ్యత ఉంది

ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రస్తుతం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం సహజం. కానీ ప్రతిపక్ష రాజకీయాలు కేవలం ప్రభుత్వ వ్యతిరేకత చుట్టూ మాత్రమే తిరగకూడదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలయ్యాయి? ఏ హామీలు అమలు కాలేదు? ఏ రంగంలో ప్రభుత్వం విఫలమైంది? ప్రజలకు ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ ఏం చేయాలనుకుంటోంది? వంటి అంశాలపై స్పష్టమైన విధానపరమైన చర్చ అవసరం. ఇటీవలి భూవివాదాల్లో బీఆర్ఎస్ నేతలు ఇరుపక్షాల ఆస్తులపై న్యాయ విచారణకు డిమాండ్ చేయడం ద్వారా రాజకీయ చర్చను మరో దిశకు తీసుకెళ్లారు. అయితే ఇలాంటి డిమాండ్లు రాజకీయ ఆరోపణల స్థాయిని దాటి వాస్తవ విచారణ, అధికారిక పత్రాలు, చట్టపరమైన ప్రక్రియల వైపు వెళ్లినప్పుడే ప్రజలకు స్పష్టత లభిస్తుంది.

### అసలు పోటీ ప్రజల సమస్యలపై ఉండాలి

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు ఎంత తీవ్రంగా ఉన్నా, దాని ప్రభావం చివరికి ప్రజల జీవితాలపై పడుతుంది. సిరిసిల్లలో పవర్‌లూమ్ కార్మికుల సమస్యలు, చేనేత రంగం పరిస్థితి, ఉపాధి, యువత భవిష్యత్తు, రైతుల సమస్యలు, పట్టణ మౌలిక వసతులు వంటి అంశాలు రాజకీయ ప్రసంగాల్లో వెనుకబడకూడదు. అలాగే సిద్దిపేటలోనూ స్థానిక అభివృద్ధి, సాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి వంటి అంశాలపై రెండు పార్టీలు తమ విధానాలను ప్రజల ముందుంచాలి. ప్రత్యర్థి కోటలో సభ పెట్టడం రాజకీయంగా ఒక సందేశం కావచ్చు. కానీ ఆ సభలో “మేము వారిని ఓడిస్తాం” అనే నినాదం కంటే “మేము మీ కోసం ఇది చేశాం.. ఇది చేయబోతున్నాం” అనే వివరణకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటేనే ప్రజాస్వామ్యానికి ప్రయోజనం.

### రాజకీయ సమరం.. ప్రజలకు మాత్రం సమాధానాలు కావాలి

తెలంగాణలో కాంగ్రెస్--బీఆర్ఎస్ మధ్య రాజకీయ విభేదాలు ఇప్పట్లో తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. అసెంబ్లీలో భూముల వ్యవహారం, ప్రభుత్వ విధానాలు, గత పాలనపై ఆరోపణలు, ప్రస్తుత పాలనపై విమర్శలు.. ఇవన్నీ రాబోయే రోజుల్లోనూ రాజకీయ వేడిని కొనసాగించే అవకాశం ఉంది. కానీ ఈ పోరులో ఒక ముఖ్యమైన హద్దు ఉండాలి. వ్యక్తిగత విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు ఆధారాలతోనే ఉండాలి. దర్యాప్తు అవసరమైన అంశాలను దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలు, అధికారిక రికార్డుల ద్వారా తేల్చాలి. రాజకీయ వేదికలపై తీర్పులు ఇవ్వడం ప్రజాస్వామ్య ప్రక్రియకు ప్రత్యామ్నాయం కాదు. సిరిసిల్ల సభ ఈ నేపథ్యంలో ఒక ప్రతీకాత్మక రాజకీయ ఘట్టంగా మారుతోంది. కాంగ్రెస్ తన ప్రభుత్వ పనితీరును వివరించేందుకు, బీఆర్ఎస్ తనపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు ఇది ఒక అవకాశంగా మారవచ్చు. చివరికి సిరిసిల్లలో కాంగ్రెస్ సభ ఎంత పెద్దదిగా జరిగింది? ఎంత మంది హాజరయ్యారు? ఎన్ని నినాదాలు వినిపించాయి? అన్నదానికంటే ముఖ్యమైన ప్రశ్న సిరిసిల్ల ప్రజల సమస్యలకు ఎవరు ఏ సమాధానం చెప్పారు? రాజకీయ పార్టీలు నియోజకవర్గాలను లక్ష్యంగా చేసుకోవచ్చు. సభలు నిర్వహించవచ్చు. ప్రత్యర్థులకు సవాళ్లు విసరవచ్చు. కానీ ప్రజలు కోరుకునేది అంతకంటే భిన్నమైనది. వారికి భూములపై నిజానిజాలు కావాలి. అభివృద్ధిపై స్పష్టత కావాలి. ఉపాధిపై భరోసా కావాలి. పాలనలో పారదర్శకత కావాలి. అందుకే సిరిసిల్లలో జరగబోయే రాజకీయ సమరం కేవలం కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ పోరుగా మిగిలిపోకుండా, ప్రజా సమస్యలపై విధానాల పోటీగా మారాలి. ఆరోపణలు రాజకీయ వేడిని పెంచుతాయి. ఆధారాలు నిజానిజాలను తేలుస్తాయి. కానీ ప్రజలకు ఉపయోగపడేది మాత్రం పరిష్కారాల రాజకీయమే.

# వనరులున్నా అభివృద్ధి శూన్యం

అపారమైన సహజ వనరులు, మానవ వనరులు ఉన్నా అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతంగా కాటారం పరిస్థితి మారుతోంది. ఒకప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రముఖ వాణిజ్య కేంద్రంగా వెలిగిన కాటారం నేడు వ్యాపార మాంద్యంతో వెలవెలబోతోందని స్థానికులు, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి కేవలం ఒక ప్రాంత ఆర్థిక సమస్య కాదు.. సరైన ప్రణాళిక లేకపోతే వనరులు ఉన్నా అభివృద్ధి సాధ్యం కాదనే విషయాన్ని గుర్తుచేస్తోంది. 1990 నుంచి 2020 వరకు కాటారం చుట్టుపక్కల మండలాలతో పాటు మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలకు కూడా ప్రధాన మార్కెట్‌గా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. నిత్యావసర వస్తువుల నుంచి బంగారం వరకు కొనుగోళ్ల కోసం ప్రజలు కాటారానికే వచ్చేవారు. పండుగల సమయంలో రద్దీతో కళకళలాడిన వ్యాపార కేంద్రం నేడు కస్టమర్ల కోసం ఎదురుచూస్తోంది. చిన్న వ్యాపారాల నుంచి హోటళ్లు, ఆటోలు, ప్రైవేట్ ఆసుపత్రులు, మెడికల్ షాపులు, విద్యాసంస్థల వరకు ఈ ప్రభావం కనిపిస్తోంది. కాటారం పక్కనే గోదావరి ప్రవహిస్తున్నా సాగునీటి కొరత ఉండటం మరో ప్రధాన



సమస్య. రైతులు వర్షాలపై ఆధారపడాల్సి వస్తుండటంతో వ్యవసాయ రంగం స్థిరమైన ఆదాయాన్ని అందించలేకపోతోంది. వ్యవసాయానికి అనుబంధంగా పరిశ్రమలు లేకపోవడం సమస్యను మరింత పెంచుతోంది. ముడిసరుకు, మానవ వనరులు ఉన్నప్పటికీ స్థానికంగా పరిశ్రమలు లేక యువత ఉపాధి కోసం హైదరాబాద్, ఇతర నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ పరిస్థితిలో అత్యంత ఆందోళన కలిగించేది యువత భవిష్యత్తు. చదువుకున్నా స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లేకపోతే వలసలు పెరుగుతాయి. ఉపాధి అవకాశాలు లేకపోవడం సామాజిక సమస్యలకు కూడా దారితీసే అవకాశం ఉంది. కాబట్టి కాటారం అభివృద్ధిని కేవలం రహదారులు, భవనాల నిర్మాణానికి పరిమితం చేయకుండా ఉపాధి-పరిశ్రమలు-సాగునీరు-వ్యాపారం అనే నాలుగు అంశాలను అనుసంధానిస్తూ చూడాలి. సింగరేణి, చిన్న కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల అవకాశాలను సాధ్యాసాధ్యాల ఆధారంగా పరిశీలించడంతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, చిన్న-మధ్య తరహా పరిశ్రమలు, స్థానిక ముడిసరుకుకు విలువ జోడించే యూనిట్లను ప్రోత్సహించాలి. మార్కెట్ సదుపాయాలు, రవాణా, గిడ్డంగులు, డిజిటల్ వాణిజ్యానికి స్థానిక వ్యాపారులను అనుసంధానం చేయడం కూడా అవసరం. కాటారం పూర్వ వైభవం కేవలం జ్ఞాపకంగా మిగలకూడదు. వనరులను అవకాశాలుగా, అవకాశాలను ఉపాధిగా మార్చే సమగ్ర అభివృద్ధి ప్రణాళికే కాటారానికి అవసరం. ప్రభుత్వాలు ఇప్పటికైనా దృష్టి సారిస్తే ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు మళ్లీ చైతన్యం తీసుకురావచ్చు.

# వాళ్లదే ఇష్టారాజ్యం!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ మొత్తం కొందరు కాంట్రాక్టర్ల కనుసన్నల్లో నడుస్తున్నదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆ శాఖలో ఏ పని జరగాలన్నా సదరు కాంట్రాక్టర్ల అనుమతి ఉండాల్సిందేనని ఆరోపణలు ఉన్నాయి. ఏ టెండరు ఎప్పుడు పిలవాలి? అందులో ఏ నిబంధనలు ఉండాలి? ఎవరికి టెండర్ ఇవ్వాలి? ఇలా ప్రతి విషయంలో వారి జోక్యం ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అలాగే కీలకమైన ఫైల్ కదలికల్లో సైతం వారి ప్రమేయం ఉంటుందంటూ ఫిర్యాదులు ఉన్నాయి. సదరు కాంట్రాక్టర్ల జోక్యంతో విసిగిపోయిన ఆ శాఖ సిబ్బంది సంబంధిత మంత్రికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది.

**నిత్యం ఆ శాఖ చుట్టూ ప్రదక్షిణలు**

ఉత్తర తెలంగాణ ఏరియాలో జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల్లో ఉన్న ఒకరిద్దరు నాయకుల చేతుల్లో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. సదరు నాయకులు తెల్లారితే సెక్రెటేరియట్‌లోని ఆ శాఖకు చెందిన సెక్షన్లలో కనబడుతుంటారని విమర్శలు ఉన్నాయి. ఆ రోజు ఆ శాఖలో ఏం జరుగుతుందోనని తెలుసుకునేందుకు ప్రతి సెక్షన్‌కు నేరుగా వెళ్తుంటారని ఫిర్యాదులు వస్తున్నాయి. టెండర్లకు సంబంధించిన ఫైల్స్ ఎక్కడ ఉన్నాయి? ఏ అధికారి వద్ద ఉన్నాయి? అందులో ఎలాంటి నిబంధలను పెట్టారు? అనేది ముందే తెలుసుకుంటారు. తమకు అనుకూలమైన వ్యక్తులు/సంస్థలకు టెండర్లు దక్కే విధంగా రూల్స్ పెట్టాలంటూ అధికారులపై ఒత్తిడి పెడుతుంటారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే పోస్టింగ్స్‌కు సంబంధించిన ఫైల్స్‌ను సైతం రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేస్తూ ఎప్పటికప్పుడు డెవలప్‌మెంట్‌ను తెలుసుకుంటారని సమాచారం.

**ఫోన్ చేసి డబ్బులు డిమాండ్**

తమకు అనుకూలంగా టెండరు నిబంధనలు పెట్టించుకుని, ప్రయోజనం పొందుతున్న సదరు కాంట్రాక్టర్ల బృందం ఆ శాఖలోని హెచ్‌వోడీ, జిల్లా స్థాయి అధికారులకు చెందిన ఫైళ్ల మూవ్‌మెంట్‌ను తెలుసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా పోస్టింగ్‌కు సంబంధించిన ఫైళ్ల విషయంలో ముందుగా సమాచారం తెలుసుకుని, సదరు అధికారులకు ఫోన్ చేస్తుంటారని తెలిసింది. 'మీ ఫైల్ సెక్రెటేరియట్‌లో ఫలానా అధికారి వద్దకు వచ్చింది. మేం ఓకే చెబితేనే ముందుకు వెళ్తుంది. లేకపోతే కొర్రీలు పడుతయి' అంటూ ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. దీనితో బాధిత అధికారులు ఎంతో కొంత ముట్టజెప్పి తమ ఫైల్స్‌ను క్లియర్ చేయించుకుంటున్నట్లు తెలిసింది.

**సీఎం సన్నిహితులు క్లోజ్ అంటూ బెదిరింపులు**

శాఖకు చెందిన అధికారులు సదరు కాంట్రాక్టర్ల ఒత్తిళ్లు, బెదిరింపులకు మొదట్లో తలొగ్గలేదు. ఏం చెప్తే అది చేయం అంటూ తెగిసి చెప్పారు. దీనితో తమ అసలు అస్త్రాన్ని కాంట్రాక్టర్ల టీమ్ ప్రయోగించినట్లు ప్రచారం జరుగుతున్నది. సీఎంకు అత్యంత సన్నిహితుడుగా ఉండే ఓ వ్యక్తి ద్వారా అధికారులకు ఫోన్ చేయించి, వాళ్లు అడిగిన పనులు చేసిపెట్టాలని దమ్కీ ఇప్పించినట్లు ప్రచారం జరుగుతున్నది. దీనితో అప్పటినుంచి ఆఫీసర్లు వారు చెప్పినట్లుగా నడుచుకుంటున్నట్లు టాక్ ఉంది. ఎవరైనా కాదు.. కూడదు.. అంటూ మొండికేస్తే నేరుగా వెళ్లి తమ స్టైల్‌లో బెదిరిస్తున్నట్లు తెలిసింది. తమకు కావాల్సిన ప్రతి ఫైల్ మూవ్‌మెంట్ ఎప్పటికప్పుడు మాకు తెలపాలని కండీషన్ పెట్టినట్లు సమాచారం. దీనితో విసిగిపోయిన కొందరు అధికారులు మంత్రి సీతక్కకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

**పేషీ సహకారంతో దూకుడు**

ఆ టీమ్ ఆగడాలకు సంబంధిత శాఖ మంత్రికి చెందిన పేషీ స్టాఫ్ సహకారం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఎందుకంటే సంబంధిత టీమ్ రెగ్యులర్‌గా ఆ పేషీలో కూర్చోని అక్కడి నుంచి ల్యాండ్‌లైన్ ద్వారా ఫోన్లు చేస్తుంటారని తెలిసింది. మంత్రి లేని సమయంలో నేరుగా మంత్రి చాంబర్‌లో కూర్చోని తమ యాక్టివిటీస్‌పై సమాలోచనలు చేస్తుంటారని నిఘా వర్గాలకు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. అయితే కాంట్రాక్టర్లు అడిగిన సమాచారాన్ని కొందరు అధికారులు ఇవ్వకపోతే మంత్రి పేషీలో పనిచేస్తోన్న స్టాఫ్ రంగంలోకి దిగుతుంటారని టాక్ వినిపిస్తోంది. 'వాళ్లు అడిగిన సమాచారం ఇవ్వాలి, ఇవ్వమంటే కుదరదు' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

# డీజే దరువు.. గుండెల్లో బరువు

**వాంకిడి(మంచిర్యాల),ఫ్లాష్ ఇండియా :** సందర్భం ఏదైనా... శబ్దాలమోత ఇప్పుడు ఫ్యాషన్‌గా మారింది. అందులో ప్రధానంగా డీజే బాక్స్‌లు సర్వసాధారణమవుతున్నాయి. రాజకీయ, సామాజిక వర్గాల ప్రదర్శనలు దగ్గరి నుంచి మొదలుకుని వివాహ శుభకార్యాల బరాత్ (ఊరేగింపు), దైవ విగ్రహాల ప్రదర్శన వరకు ఎక్కడ చూసినా డీజే శబ్దాలు మోత మోగిపోతున్నాయి. మితిమీరిన శబ్దం గుండేలయ తప్పించే ప్రమాద ముంది. డీజే శబ్దాలతో వృద్ధులు, పిల్లలతో పాటు యువతా బలవుతున్నారు. హుషారు గా నృత్యం చేస్తున్న యువకులు ఉన్నట్లుండి కుప్పకూలుతున్నారు. అధిక శబ్దాలతో గర్భంలోని శిశువులపై కూడా దుష్ప్రభావం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ లేబర్ ఇండస్ట్రీ యాక్టు ప్రకారం పాటించాల్సిన నిబంధ నలు అమలుకు నోచుకోవడంలేదు.

**ప్రారంభం నుంచే..**

డీజే శబ్దం ప్రారంభం నుంచే 100 డిసెబుల్స్ ఉంటుంది. సాధారణంగా చెవి వినికిడి సామర్థ్యం కంటే అదనంగా 20 డెసిబుల్స్‌తోనే ప్రారంభం అవుతుంది. 130 డిసెబుల్స్‌కి మించి అంతకంటే ఎక్కువైతే వినికిడిని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉంది. కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకంగా మారుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. డీజే సౌండ్స్ గంటల కొద్ది వినడం వల్ల కొంత మందికి తాత్కాలి కంగా చెవుడు ప్రారంభమై కొన్ని రోజులకు సాధారణస్థితికి విని కిడి సమస్య వచ్చే అవకాశాలుంటాయి. 130 డిసెబు ల్స్ కంటే ఎక్కువ శబ్దాన్ని ఎక్కువ సమయం వింటే చెవిలో ఉండే చిన్న చిన్న హియరింగ్ సెల్స్ చని పోయి శాశ్వతంగా చెలి వినికిడి సామర్థ్యాన్ని కోల్పో వాల్సి వస్తుంది. ఒకేసారి చెవి సామర్థ్యానికి మించిన శబ్దం వింటే టసాస్టిక్ ట్రామా బారిన పడాల్సి వస్తుంది. మొదడులో స్ట్రెస్ హార్మోన్స్ పెరిగి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చే అవకాశాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. శబ్దం తీవ్రత పెరుగుదల వల్ల ఎండోసి లియల్ సెల్స్ దెబ్బతిని దీర్ఘకాలంలో గుండెపోటు సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. గుండె సంబంధి త సమస్యలున్న వారికి డీజే శబ్దం వల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**కేసులు నమోదు ఇలా...**

పోలీసుల అనుమతి తీసుకోకుండా డీజేలు ఉప యోగిస్తే కేసులు నమోదు చేస్తారు. న్యూసెన్స్ లేదా శబ్ద కాలుష్య కింద కేసులు నమోదు చేసి ఆయా వాహనాలతో పాటు డీజే కోసం ఉపయోగించిన అన్ని వస్తువులను సీజ్ చేస్తారు. తర్వాత బాధితులు కోర్టుకు వెళ్లి జరిమానా చెల్లించి తిరిగి వాహనం తీసుకోవాల్సి ఉంటుంది. అనుమతి తీసుకొని కూడా సమయపాలన పాటించకుండా డీజే వినియోగిస్తే కూడా కేసులు నమోదు చేస్తారు. కోర్టులో రూ. 500 నుంచి రూ. 1000 వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది.

**నిబంధనలు ఇలా..**

నిబంధల ప్రకారం 70 డిసిబుల్స్ సౌండ్ వరకే పరిమితి ఉంది. అంతకు మించితే చట్ట రీత్య నేరం. రాత్రి 10 నుంచి ఉదయం 6 మధ్య భారీశబ్దాలతో ఎలాంటి వేడుకలు, ఊరే గింపులు చేయకూడదు. ఆస్పత్రులు, పాఠశాలలు, కోర్టులను నిశబ్ద జోన్లుగా పరిగణిస్తారు. అధి కార యంత్రాంగం అమలుకు చర్యలు చేపడుతన్నప్పటికి ప్రజా ప్రతి నిధులు, రాజకీయ శ్రేణులు, వివిధ సంఘాల ఒత్తిడులతో ముందడుగు వేయడంలేదు. సాధారణంగా 70 డెసిబుల్స్ శబ్దాలను వినడానికి మానవుల చెరవులు సహకరిస్తాయి. 70-85 డెసిబుల్స్ వరకు శబ్దాన్ని ఏడు నసుంచి ఎనిమిది గంటలు, 90 డెసిబుల్స్ వరకు నాలుగు గంటల పాటువినవచ్చు. డీజే శబ్దం 200 డెసిబుల్స్ పైనే ఉంటుంది. ఇది అత్యంత ప్రమాదకరం. భారీ సౌండ్ ప్రకంపనలకు చెవుల్లో సున్నిత కణాలు దెబ్బతింటాయి. కర్ణభేరి దెబ్బతిని శాశ్వత వినికిడి లోపానికి దారి తీస్తుంది. గుండె జబ్బులు ఉన్న వారికి తీవ్ర ప్రభావం చూపుతుంది.

# రాష్ట్రవ్యాప్తంగా భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం..

**ఆంధ్రప్రదేశ్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా రూ. 11,359 కోట్ల విలువైన భారీ అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కుప్పం పర్యటనలో ఉన్న ఆయన, అక్కడి నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 123 మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.

**రూ.11,359 కోట్ల కేటాయింపుల వివరాలు**

రాష్ట్రంలో తొలిసారిగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో ఈ అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతోంది. 123 మున్సిపాలిటీల పరిధిలో రూ. 7,469 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టారు. విశాఖపట్నం పరిధిలోనే రూ. 3,890 కోట్ల విలువైన మౌలిక వసతుల పనులను ప్రారంభించారు. రహదారుల విస్తరణ, మరమ్మతుల కోసం రూ. 4,656 కోట్లు కేటాయించారు. పట్టణాల్లో ఆహ్లాదకరమైన



వాతావరణం కోసం పార్కుల అభివృద్ధికి రూ. 509 కోట్లు కేటాయించారు. పట్టణాల్లో వీధి దీపాల ఏర్పాటుకు రూ. 247 కోట్లు వెచ్చించనున్నారు.

**అభివృద్ధి పనుల్లో నాయకులే బాధ్యత వహించాలి: సీఎం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేసరికి ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, అయితే కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తెస్తున్నామని వివరించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని, HAM మోడల్ ద్వారా వినూత్నంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ప్రతి మంచి పనిని కొంతమంది కావాలనే తప్పుగా చూపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పట్టణ, స్థానిక సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. "తమ పరిధిలోని అభివృద్ధి పనులకు స్థానిక రాజకీయ నాయకులే పూర్తి బాధ్యత వహించాలి. మున్సిపల్ కమిషనర్లు, అడ్మినిస్ట్రేటర్లు క్షేత్రస్థాయిలో ఉండి ఈ పనులను వేగవంతంగా పూర్తి చేయించాలి" అని సూచించారు.



# యువతి అనుమానాస్పద మృతి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఓ యువకుడు, యువతి కలిసి ఓయోలో రూమ్ బుక్ చేసుకున్నారు. కట్ చేస్తే.. ఆ యువతి తీవ్ర గాయాలతో చనిపోయింది. ఈ ఘటన మాదాపూర్ లోని సిద్ధిఖీనగర్ లో ఉన్న ఓయో హోటల్ లో వెలుగుచూసింది. విశాఖపట్నానికి చెందిన యువతి.. తన ప్రియుడు శ్రీనివాసరవితేజ కలిసి రూమ్ బుక్ చేసుకున్నారు. అర్ధరాత్రి యువతి అపస్మారక స్థితికి చేరుకోవడంతో వెంటనే హోటల్ సిబ్బందితో కలిసి కొండాపూర్ లోని ఆస్పత్రికి తరలించాడు ప్రియుడు. అప్పటికే ఆమె మరణించిందని వైద్యులు నిర్ధారించారు. దీంతో రవితేజ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. వారిద్దరూ స్టే చేసిన హోటల్ రూమ్ ను పరిశీలించారు. గోడలపై, బెడ్ పై రక్తపు మరకలు ఉండటాన్ని గుర్తించి.. కేసు నమోదు చేశారు. అక్కడ ఉన్న బీరు బాటిళ్లు, విస్కీలను స్వాధీనం చేసుకున్నారు. యువతి ముఖం, శరీరంపై గాయాలుండటంతో.. ప్రియుడిపై కేసు నమోదు చేసి.. పరారీలో ఉన్న రవితేజను పట్టుకునేందుకు గాలిస్తున్నారు. యువతి పోస్టుమార్టమ్, ఫోరెన్సిక్ నివేదిక వచ్చాక మృతికి గల కారణాలు తెలుస్తాయన్నారు. మరోవైపు ఆ ఓయో హోటల్ నిర్వాహకుడిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హోటల్ కు వచ్చినవారి వివరాలు తీసుకోవాలన్నది పోలీసుల నిబంధన. కానీ.. ఇటీవలే లేడీస్ హాస్టల్ గా ఉన్న బిల్డింగ్ ను ఓయోగా రిజిస్టర్ చేశాడు యజమాని. హోటల్ కు వచ్చినవారి వివరాలేవీ అతను తీసుకోకపోవడంపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



# వైజాగ్ డ్యాన్స్ గ్రూప్‌ను పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో జరిగిన వినాయక నిమజ్జన వేడుకల్లో కొండచిలువతో డాన్స్ చేస్తూ హల్‌చల్ చేసిన విశాఖపట్నానికి చెందిన ఓ డ్యాన్స్ బృందాన్ని మధురానగర్ పోలీసులు, గ్రేటర్ హైదరాబాద్ సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు యానిమల్స్ (జీహెచ్‌ఎస్‌పీసీఏ) అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. నిమజ్జన ఊరేగింపులో తమ ప్రదర్శనను ప్రత్యేకంగా చూపించుకోవాలనే ఉద్దేశంతో సదరు గ్రూప్‌లోని ఓ యువతి సజీవంగా ఉన్న భారీ కొండచిలువను మెడలో వేసుకుని, చేతులు తిప్పుతూ డ్యాన్స్ చేసింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అప్రమత్తమైన జంతు సంరక్షణ విభాగం, పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగింది. నిందితులను గుర్తించేందుకు దాదాపు ఐదు రోజుల పాటు ప్రత్యేక నిఘా ఉంచి వారి కదలికలను ట్రాక్ చేసిన అనంతరం ఎట్టకేలకు బృందాన్ని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, జీహెచ్‌ఎస్‌పీసీఏ ప్రతినిధులు సదరు వైజాగ్ గ్రూప్ నుంచి ఆ కొండచిలువతో పాటు వారి వద్ద ఉన్న ఒక కోడిని సురక్షితంగా రక్షించారు. అనంతరం కొండచిలువను వైద్య పరీక్షల నిమిత్తం పశువైద్యుల వద్దకు తరలించగా, దానికి తీవ్రమైన నోటి ఇన్ఫెక్షన్ ఉన్నట్లు గుర్తించారు. మూగ జీవాన్ని తీవ్ర వేదనకు గురి చేస్తూ ప్రదర్శనల్లో ఉపయోగించినందుకు గాను నిర్వాహకులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం, జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం కొండచిలువను నిపుణులైన పశువైద్యుల సంరక్షణలో ఉంచి చికిత్స అందిస్తున్నామని, వన్యప్రాణులను వేడుకల్లో అక్రమంగా వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# హైదరాబాద్ కు తాగునీటి ముప్పు..!

**మూడు పంటలుగా మూలనపడ్డ నాగలి.. బీడువారిన భూములు**

- ఎల్‌నినో ప్రభావంతో వర్షాలకు బ్రేక్
- మూడు పంటలుగా బీడుగా మారిన భూములు
- డెడ్ స్టోరేజ్‌కు చేరిన సింగూరు, మంజీరా
- ఇంటేక్ వెల్స్‌తో తాగునీటికి అత్యవసర చర్యలు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి మెదక్ జిల్లాలో 'ఎల్‌నినో' ప్రభావం తీవ్ర అలజడి సృష్టిస్తోంది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులన్నీ ఎండిపోయి తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. జలాశయాల్లో నీటి మట్టాలు అడుగంటిపోవడంతో అటు వ్యవసాయ రంగం, ఇటు తాగునీటి వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయి. ఎప్పుడూ జలకళతో ఉట్టిపడే ప్రాజెక్టులు నేడు వెలవెలబోతూ కనిపించడం స్థానిక ప్రజలను, రైతులను కలవరపెడుతోంది.

**మూడు పంటలుగా మూలనపడ్డ నాగలి.. బీడువారిన భూములు**

వర్షాలు ముఖం చాటేయడంతో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సాగు నీరు అందక రైతాంగం తీవ్ర అవస్థలు పడుతోంది. ప్రాజెక్టుల్లో చుక్క నీరు లేక పంట కాలువలు ఎండిపోవడంతో రైతులు పంటలు వేయలేక చేతులెత్తేశారు. గడిచిన మూడు పంట కాలాలుగా రైతులు తమ సాగు భూములను వేయకుండా బీడుగా వదిలేయాల్సిన దుస్థితి ఏర్పడింది. జలాశయాల ఆధారంగా సాగయ్యే ఆయకట్టు ప్రాంతాలు ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతున్నాయి.

**అడుగంటిన ప్రాజెక్టులు.. నగరానికీ తప్పని తాగునీటి ముప్పు**

జిల్లాలోని జలాశయాలు కేవలం స్థానిక గ్రామాలకే కాకుండా, హైదరాబాద్ నగరానికి కూడా ప్రధాన తాగునీటి ఆధారంగా ఉన్నాయి. ఇప్పుడు సింగూరు, మంజీరా బ్యారేజీలు డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకోవడంతో రాబోయే రోజుల్లో రాజధాని నగరంతో పాటు స్థానిక ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదం కనిపిస్తోంది. సాధారణంగా ఈ సమయానికి 17 టీఎంసీల నీటి నిల్వ ఉండాల్సిన సింగూరు ప్రాజెక్టులో ప్రస్తుతం కేవలం 4 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి, అది కూడా వాడుకోలేని డెడ్ స్టోరేజ్ మట్టంలో ఉంది. ఇక మంజీరా బ్యారేజ్ పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. చుక్క నీరు లేక ప్రాజెక్టులో ఇసుక మేటలు వేసి, గడ్డి మొలిచింది. వీటితో పాటు ఘనపురం, హల్దీవాగు, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వలు గణనీయంగా పడిపోయాయి.

**ఇంటేక్ వెల్స్‌తో అత్యవసర చర్యలు.. మిషన్ భగీరథపై భారం**

ఈ తీవ్ర నీటి కష్టాల నుంచి ప్రజలను గట్టెక్కించేందుకు అధికారులు అత్యవసర చర్యలు చేపట్టారు. తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోకుండా ఉండేందుకు సింగూరు ప్రాజెక్టు వద్ద ప్రత్యేకంగా ఇంటేక్ వెల్స్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా ప్రాజెక్టు అడుగున ఉన్న తక్కువ నీటిని , భూగర్భ జలాలను తోడి, వాటిని శుద్ధి చేసి 'మిషన్ భగీరథ' పథకం ద్వారా ప్రజలకు అందించేందుకు యత్నిస్తున్నారు. రాబోయే రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఇలాగే ఉంటే నీటి సమస్య మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రిమ్స్‌లో అర్ధరాత్రి అగ్నిప్రమాదం..

**ఆదిలాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి ఎస్‌ఎన్‌సీయూ వార్డులో సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్ (ఎస్‌ఎన్‌సీయూ)లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కొద్దిసేపట్లోనే వార్డు మొత్తం దట్టమైన పొగ, అగ్నికీలలతో నిండిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు నవజాత శిశువులు మృతి చెందారు. ఇదే వార్డులోని మరో 28 మంది చిన్నారులను సురక్షితంగా బయటకు తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. ఎయిర్ కండిషనర్ (ఏసీ)లో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ దురదృష్టకర ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి దర్యాప్తు తరువాతే ప్రమాదానికి కారణమైన వివరాలను తెలియజేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇక ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి ఎస్‌ఎన్‌సీయూ వార్డులో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని సీఎం ఆదేశించారు. మరోవైపు, అగ్ని ప్రమాద ఘటనపై ఉన్నతాధికారులతో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదంలో చిన్నారి మృతి చెందడం పట్ల మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్నారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని మంత్రి ప్రార్థించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఘటనా సమయంలో వార్డులో ఉన్న మిగిలిన చిన్నారులందరి పరిస్థితి నిలకడగా ఉందని, ఎవరికీ సమస్య లేదని అధికారులు మంత్రికి వివరించారు. పిల్లలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సూచించారు. అగ్ని ప్రమాదానికి గల కారణంపై తక్షణమే విచారణ మొదలు పెట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# క్యూర్ బిల్లుకు గవర్నర్ ఆమోదం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో సమర్థవంతమైన పాలన, డిజిటల్ ఆధారిత వ్యవస్థగా తీర్చిదిద్దడం దిశగా కీలక అడుగు పడింది. క్యూర్ బిల్లుకు తెలంగాణ గవర్నర్ ఆమోదం తెలిపారు. అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లుపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా సంతకం చేశారు. దీంతో జీహెచ్‌ఎంసీ-1955 స్థానంలో క్యూర్ -2026 చట్టం అమల్లోకి రానుంది. ఒకే నగరం.. ఒకే పరిపాలన ఒకే చట్టం లక్ష్యంతో జీహెచ్‌ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీల పరిధిలో వర్తించేలా ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చింది. ఈ చట్టం ద్వారా హైడ్రాకు చట్టపరమైన గుర్తింపు, అదనపు అధికారాలు లభించనున్నాయి. క్యూర్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో ఏకీకృత పాలనా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కాలం చెల్లిన, అవసరం లేని నిబంధనలను తొలగించడం ప్రస్తుత అవసరాలకు తగినట్టుగా మార్పులు చేయడం లక్ష్యంగా క్యూర్ బిల్లును తీసుకువచ్చారు.

# పర్యాటక ప్రదేశాల సందర్శనతో చారిత్రక సాంస్కృతిక విజ్ఞానం కలుగుతుంది...





**నల్గొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలంగాణలోని ముఖ్యంగా నల్లగొండ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించడం వల్ల విద్యార్థులకు చారిత్రక, సాంస్కృతిక విజ్ఞానం కలుగుతుందని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా నాగార్జున ప్రభుత్వ కళాశాలలో జిల్లా స్థాయి 'యువ టూరిజం క్లబ్' పోటీలు ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా పర్యాటక శాఖ మరియు జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో, తెలంగాణ టూరిజం సహకారంతో 'యువ టూరిజం క్లబ్' ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించబడుతున్నాయని అన్నారు. వారసత్వం మరియు సమాజ ప్రోత్సాహం అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతున్నదని అన్నారు. ఈ జిల్లా స్థాయి కళాశాల పోటీలలో భాగంగా షార్ట్ ఫిలిం, రీల్ పోటీలు, సోషల్ మీడియా టూరిజం క్యాంపెయిన్, టూరిజం అవేర్‌నెస్ స్కిల్స్, పాటలు, నృత్యం, మరియు డ్రామా వంటి వివిధ అంశాలు నిర్వహించడ్డాయి. అలాగే తక్కువ ప్రాచుర్యం పొందిన పర్యాటక ప్రదేశాలు, మరుగన పడిన కళలు, మరియు స్థానిక భాగస్వామ్యంతో కూడిన వినూత్న ఆలోచనలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్, అడిషనల్ ఎస్పీ జి రమేష్, నల్గొండ డిస్టిక్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ దసరా నాయక్, జిల్లా పంచాయతి అధికారి తరుణ్ చక్రవర్తి, నల్లగొండ జిల్లాడిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ, కార్పొరేటర్ సమద్ ఎం.డి ఇంతియాజ్ జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎండి అక్బర్ అలీ న్యాయ నిర్ణేతలుగా తెలుగుశాఖ అధ్యక్షులు డా. వెల్దశీడి శ్రీధర్, డా. ఎం.డి హసేనా జిల్లాలోని వివిధ కళాశాల అధ్యాపకులు,యువ టూరిజం క్లబ్ జిల్లా కో- ఆర్డినేటర్ నర్సింగ్ కోటయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు సంతకం (కవిత )

మెరిసే కళ్ళు వెంటబడటాయి..
ఓ పలకరింపు మనసును తట్టి
లేపుతుంది
పిల్లగాలి ఊహల్ని వసంతం
చేస్తాయి..
ఆ సంకేతం వద్ద ఆగి దేహం
మురిసిపోతుంది
నెత్తిన బరువుండి కాలం కట్టడి
చేసినా సుడులు తిరిగి
అల్పపీడనమై బరువెక్కిన దిగులు
మేఘాలు అటే జారిపోతాయి..
ప్రేమ తెలిసిన మాటే..
నిత్యం బతుకు దానికై
నిరీక్షిస్తుంది..
అది ఉంటేనే
మనది ఓ వెలుగు సంతకం
అవుతుంది...

**తంగెళ్లపల్లి కనకా చారి**
**హైదరాబాద్**
**8790874028**



# పిడుగుపాటుతో 24 గొర్రెలు మృతి

## బాధిత గొర్రెల కాపరులను ప్రభుత్వం ఆదుకుంటుంది : ప్రభుత్వ విప్ విజయరమణ రావు



**పెద్దపల్లి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పెద్దపల్లిమండలంలోని మూలసాల గ్రామంలో పిడుగుపాటుకు 24 గొర్రెలు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మంగళవారం సంఘటనా స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి బాధితులను పరామర్శించారు.మూలసాల గ్రామానికి చెందిన బోయిని సదయ్య, కాసు నరేష్‌లకు చెందిన గొర్రెలను అన్నయ్యకుంట చెరువు సమీపంలో మేపుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ క్రమంలో పిడుగు పడటంతో మందలోని 24 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న బాధిత కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ.. ఒక్కసారిగా ఇంత పెద్ద సంఖ్యలో గొర్రెలు మృతి చెందడం బాధాకరమన్నారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. సంఘటనా స్థలం నుంచే జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి మృతి చెందిన గొర్రెల వివరాలను నమోదు చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెపా- ్రరు.కార్యక్రమంలో మూలసాల గ్రామస్థులు, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో రమణారెడ్డి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** గణేష్ ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్ రమణారెడ్డి వేములపల్లి వంతెన వద్ద గణేశ విగ్రహ నిమజ్జన కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన భద్రత చర్యలపై పోలీసులకు, అధికారులకు సూచనలు చేశారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా మరియు పరిశుభ్రమైన వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లను సమన్వయంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ పీఎన్డి ప్రసాద్,మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి, వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు,వేములపల్లి ఎమ్మార్వో హేమలత,ఆర్ఐ మహేందర్ రెడ్డి,ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్,ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్,మున్సిపల్ డిపార్ట్మెంట్,మత్స్యశాఖ మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రతి ఒక్కరైతు చేయించుకోవాలి

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** దామరచర్ల మండల పరిధిలోని ఇర్కిగూడెం గ్రామంలో ఏఈఓ రావుల నరేష్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించి మంగళవారం అవగాహన కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మర్ రిజిస్ట్రీ స్పెషల్ డ్రైవ్ 22 తేదీ నుండి 30 వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించబడుతుంది కనుక రైతులు దగ్గరలోని మీసేవ లేదా ఏఈఓ దగ్గర ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి అని తెలిపారు. ప్రతి రైతు కూడా రైతు రిజిస్ట్రీ చేసుకోవాలని తెలిపారు దీని వలన పియం కిసాన్,ఎరువుల బుకింగ్, వ్యవసాయ రుణాలు ఫార్మర్ ఐడి ద్వారా మాత్రమే వస్తాయి అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పద్మం సత్యనారాయణ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# దసరా నాటికి పెద్దపల్లి ఆర్టీసీ డిపో ప్రారంభం



**పెద్దపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రూ. 8 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన ఆర్టీసీ బస్సు డిపో పనులు తుదిదశకు చేరుకున్నాయి. దసరా నాటికి డిపోను ప్రారంభించేందుకు పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్టీసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి డిపో నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి ప్రజల చిరకాల స్వప్నమైన బస్సు డిపోను రాష్ట్ర ప్రభుత్వం రూ. 8 కోట్లతో మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని, నిర్మాణంలో నాణ్యత ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సూచించారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి దసరా నవరాత్రుల్లో డిపోను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్, ఆర్టీసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేత



**మిర్యాలగూడ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ నియోజకవర్గం దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన రూపావత్ బాసు తండ్రి లకుపతికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్‌ను ఆయన ఇంటికి వెళ్లి అందజేశారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ఆదేశాల మేరకు సామాజిక వేత్త,కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండ లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు రూపావత్ బాసు,కుటుంబ సభ్యులు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు సహకరించిన ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీర్లపాలెం లిఫ్ట్ చైర్మన్ అల్లం నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గుంజ రామయ్య, పాడిగపాటి సీతారాం రెడ్డి, గుగులోతు మాన్య,ఆంగోతు బాలు నాయక్,బానోతు బాలు నాయక్ ,బుర్రి పాపయ్య, మసీముక్కు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బెజ్జం సాయి




**మిర్యాలగూడ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** హైదరాబాద్ లకిడికపూల్‌లోని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామ సర్పంచ్ బెజ్జం సాయిను నల్లగొండ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా నియమించారు. తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి బెజ్జం సాయికి నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చింతలపూడి భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చాట్ల చిరంజీవిలను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చింపుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని, సర్పంచులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. నల్లగొండ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా తనను నియమించిన తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డికి,అలాగే తనపై విశ్వాసం ఉంచి మద్దతు తెలిపిన నల్లగొండ జిల్లా సర్పంచులందరికీ బెజ్జం సాయి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచుల హక్కులు, సంక్షేమం మరియు గ్రామాల అభివృద్ధి కోసం తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని బెజ్జం సాయి తెలిపారు.



# విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పీఈటీకి ఐదేళ్ళ జైలు శిక్ష..

**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** పాఠశాలలో విద్యార్థులకు ఆటలు నేర్పాల్సిన వ్యాయామ ఉపాధ్యాయుడే అదే స్కూల్ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి ఐదేళ్ళ జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా కోర్టు మొదటి అదనపు సెషన్స్ జడ్జి వెంకటేష్ మంగళవారం తీర్పును వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. గంగాధర మండల కేంద్రానికి చెందిన 12 సంవత్సరాల బాలిక కొత్తపల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్నది. జూలపల్లి మండలం కీచులాటపల్లికి చెందిన కొత్త సాయినాథ్ పటేల్ అదే స్కూల్లో పీఈటీగా పనిచేస్తున్నాడు. 27 జనవరి 2025 రోజున మధ్యాహ్నం గేమ్స్ పీరియడ్ లో ఆటలు ముగిసిన తర్వాత పీఈటీ సాయినాథ్ బాధిత విద్యార్థినితో బాల్ ను స్పోర్ట్స్ స్టోర్ రూమ్ లో పెట్టమని చెప్పగా ఆమె వెళ్ళింది. ఆమె వెనకాలే రూమ్ లోకి వెళ్లిన పీఈటీ సాయినాథ్ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ సంఘటనపై బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు సాయినాథ్ పై కేసు నమోదు చేయగా ఎస్సై సాంబ మూర్తి దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను సిఎంఎస్ హెడ్ కానిస్టేబుల్ రాజేందర్, సిడిఓ నిహారికలు కోర్టులో ప్రవేశపెట్టగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మంచికట్ల రాజేశం వారిని విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జిల్లా రెండవ ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ఇన్చార్జి న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేష్ నిందితునికి ఐదేళ్ళ జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.



# రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీకి చిక్కిన జీపీవో

**భీమిని,ఫ్లాష్ ఇండియా :** మంచిర్యాల జిల్లా భీమిని మండలం పెద్దపేట గ్రామంలో అవినీతికి పాల్పడిన జీపీవో దుర్గాప్రసాద్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏసీబీ అధికారి మధు తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలం పెద్దపేట గ్రామానికి చెందిన ఓ రైతు, పెద్దపేట శివారులోని తన భూమిని పట్టా చేయడానికి సాదా బైనామా చేయాలని కోరాడు. దీనికి గ్రామ పంచాయతీ జీపీవో దుర్గాప్రసాద్ బేరం ఆడగా, రూ. 30 వేలు డిస్కౌంట్ ఇచ్చి రూ. 1.50 లక్షలకు ఒప్పుకున్నాడు. ఇందులో ముందుగా అడ్వాన్స్ కింద రూ. 20 వేలు తీసుకున్నాడని తెలిపారు. జీపీవోకు మధ్యవర్తిగా బిట్టుర్పల్లి గ్రామానికి చెందిన పోతురాజుల రాజేందర్ అనే వ్యక్తి భీమిని మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట కిరాణా షాప్ నడుపుకుంటూ రెవెన్యూ కేసుల్లో మధ్యవర్తిగా ఉన్నట్లు తెలిపారు. ఈ విషయంపై రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పక్కా ప్లాన్ ప్రకారం మంగళవారం పెద్దపేట గ్రామంలో రైతు వద్ద నుంచి రూ. 80 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దుర్గాప్రసాద్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం భీమిని తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కోర్టులో హాజరుపరచనున్నట్లు వివరాలు వెల్లడించారు.

# బావిలో దూకి మహిళ ఆత్మహత్య



**వెల్గటూర్,ఫ్లాష్ ఇండియా :** ఎండపల్లి మండలంలోని రాజారాం పల్లి గ్రామానికి చెందిన క్యాతం శంకరమ్మ (58 ) అనే మహిళా మంగళవారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు. గత కొంత కాలంగా ఆమె తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధ పడుతుంది. దీంతో తీవ్రమైన మానసిక వేదనకు లోనై జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లో ఉన్న చేద బావిలో దూకి ఆమె మృతి చెందారు. మృతురాలు తమ్ముడు గాజుల ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపారు.

# భారీ వర్షం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. భారీ వర్షాల పరిస్థితిపై జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్లతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్ర స్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరంలోని వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద జీహెచ్ఎంసీ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్, హైడ్రా, జీహెచ్ఎంసీ, పోలీస్, ట్రాఫిక్ తదితర అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు కొనసాగుతున్న నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని , వాటర్ లాగింగ్ లేకుండా చూడడంతో పాటు ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీస్, ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా అత్యవసరం కాని ప్రయాణాలను వీలైనంత వరకు వాయిదా వేసుకుని, వర్షాల పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో భారీ వర్షాలపై పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు.

# భారత్, జపాన్ మ్యాచ్‌పై నీలినీడలు..



భారత్, జపాన్ మధ్య నేడు జరగబోయే చారిత్రాత్మక టీ20 మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. జపాన్‌లో దుజువాన్ తుఫాన్ బీభత్సం సృష్టించడమే అందుకు కారణం. దుజువాన్ తుఫాన్ వల్ల జపాన్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే ఈ తుఫాన్ ఎఫెక్ట్ ఆసియా గేమ్స్-2026పై పడింది. సోమవారం జరగాల్సిన ఈక్వెస్ట్రియన్ పోటీలను మంగళవారానికి వాయిదా వేశారు. అలాగే, భారత జట్టు కూడా సోమవారం తమ ప్రాక్టీస్ సెషన్‌ను రద్దు చేసుకుంది. మంగళవారం జరిగే భారత్, జపాన్ టీ20 మ్యాచ్‌కు కూడా ముప్పు పొంచి ఉంది. ఇరు జట్ల మధ్య ఓ అంతర్జాతీయ మ్యాచ్ జరగడం ఇదే తొలిసారి. రెండు దేశాల మధ్య 75 ఏళ్ల స్నేహాన్ని పురస్కరించుకుని ఈ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. టోక్యోలోని సానో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. ఈ ప్రాంతంలో కూడా తుఫాన్ ఎఫెక్ట్ ఉంటుందని జపాన్ వాతావరణ శాఖ తెలిపింది. ఈ తుఫాన్ తూర్పు జపాన్ పసిఫిక్ తీరం వైపు కదులుతుందని, దీని వల్ల భారీ వర్షాలు, బలమైన గాలులు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మంగళవారం 83 శాతం వర్షం పడే అవకాశం ఉందని అక్యూ వెదర్ అంచనా వేసింది.ఒక వేళ మ్యాచ్ జరిగితే మాత్రం స్పష్టమైన ఫేవరెట్ భారతే అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. జపాన్‌పై విజయం నల్లేరు మీద నడకే. ఇటీవల అఫ్గానిస్తాన్‌పై టీ20 సిరీస్ విజయంతో భారత్ ఫుల్ జోష్‌లో ఉంది. ఆసియా క్రీడలకు ముందు జపాన్‌తో మ్యాచ్ టీమిండియా ప్లేయర్లకు సన్నాహకంగా ఉపయోగపడనుంది. శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, జస్ప్రిత్ బుమ్రా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్ ఇంటర్నేషనల్ స్టార్స్ భారత జట్టులో ఉన్నారు. బలమైన టీమిండియాకు జపాన్ ఎంత వరకూ పోటీ ఇస్తుందో చూడాలి. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇటీవల అఫ్గాన్‌తో సిరీస్‌కు బెంచ్‌కే పరిమితమయ్యాడు. జపాన్‌తో మ్యాచ్, ఆసియా క్రీడల జట్టులోనూ అతను ఉన్నాడు. మరి, జపాన్‌తో మ్యాచ్‌లోనైష్ట అతనికి తుది జట్టులో చోటు దక్కుతుందా? అన్న చర్చ జరుగుతుంది.





# ఎంఎస్ ధోనీ చక్రం తిప్పినా..

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) కీలక నిర్ణయం తీసుకుంది. భారత మాజీ స్టార్ పేసర్ జహీర్ ఖాన్‌ను కొత్త హెడ్ కోచ్‌గా నియమించింది. సోమవారం (సెప్టెంబర్ 21) సాయంత్రం జహీర్ నియామకాన్ని సీఎస్‌కే మేనేజ్‌మెంట్ అధికారికంగా ప్రకటించింది. దాదాపు 18 ఏళ్లుగా జట్టుతో కొనసాగిన స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానాన్ని జహీర్ భర్తీ చేశాడు. అయితే జహీర్‌ను హెడ్ కోచ్‌గా ఎంపిక చేయడం వెనుక మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ కీలక పాత్ర పోషించినట్లు సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ వెల్లడించారు. జహీర్ పేరును ధోనీనే సూచించినట్లు తెలిపారు. ధోనీ ప్రతిపాదనకు సీఎస్‌కే యాజమాన్యం, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ కూడా అంగీకరించడంతో జహీర్‌ను సంప్రదించినట్లు విశ్వనాథన్ చెప్పారు.ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌తో మాట్లాడిన కాశీ విశ్వనాథన్.. 'హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్ పేరును సూచించింది ఎంఎస్ ధోనీయే. క్రికెట్ మేనేజ్‌మెంట్ టీమ్‌లో ఉన్న రూపా, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ కూడా జహీర్ ఈ బాధ్యతకు సరిపోతాడని అంగీకరించారు. జహీర్‌ను హెడ్ కోచ్‌గా ఎంపిక చేయడం వెనుక ధోనీదే కీలక పాత్ర. జహీర్‌కు ఇప్పటికే ఐపీఎల్‌లో కోచింగ్, మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన అనుభవం ఉండటం కూడా అతడి ఎంపికకు ప్రధాన కారణం. ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లతో కలిసి పనిచేసిన అనుభవం జహీర్‌కు ఉంది. అందుకే అతడే సరైన వ్యక్తి అని భావించాం' అని కాశీ విశ్వనాథన్ చెప్పారు.జహీర్ ఖాన్‌ను సీఎస్‌కే హెడ్ కోచ్ పదవికి ఒప్పించడం అంత సులభంగా జరగలేదని కాశీ విశ్వనాథన్ వెల్లడించారు. అతడితో చర్చలు జరిపి, కొంత సమయం తీసుకున్న తర్వాతే జహీర్ ఈ బాధ్యతలు స్వీకరించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. జహీర్ ఖాన్‌కు ఆటగాడిగా మాత్రమే కాకుండా ఐపీఎల్ జట్ల మేనేజ్‌మెంట్‌లోనూ మంచి అనుభవం ఉంది. ముంబై ఇండియన్స్‌తో కలిసి డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్‌గా పనిచేశాడు. అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు మెంటార్, బౌలింగ్ కోచ్‌గా సేవలందించాడు. ఇక ధోనీ, జహీర్ భారత జట్టు తరఫున కలిసి ఆడారు. దీంతో ఇద్దరికీ ఒకరిపై ఒకరికి మంచి అవగాహన ఉంది. ఈ అనుభవం కూడా సీఎస్‌కేలో జహీర్ నియామకానికి ఉపయోగపడినట్లు తెలుస్తోంది.జహీర్ ఖాన్ నియామకంతో సీఎస్‌కే కోచింగ్ సెటప్‌లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశాలపై చర్చ మొదలైంది. కొత్త హెడ్ కోచ్‌కు తనకు నచ్చిన సహాయక కోచింగ్ సిబ్బందిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛను సీఎస్‌కే ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే ఐపీఎల్ 2027కు ముందు సీఎస్‌కే కోచింగ్ వ్యవస్థలో పలు కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఐపీఎల్ 2026కు ముందు సీఎస్‌కే తమ ఆటగాళ్ల బృందంలో పలు మార్పులు చేసింది. ఇప్పుడు హెడ్ కోచ్‌గా జహీర్ రాకతో కోచింగ్ విభాగంలోనూ కొత్త మార్పులు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.






# వయసు 13 స్వర్ణాలు 2

చైనా టీనేజ్ స్విమ్మర్ యు జిది ఆసియా క్రీడల్లో సంచలన ప్రదర్శనతో అదరగొడుతోంది. 13 ఏళ్ల వయసులోనే ఆసియాడ్ బరిలోకి దిగి రికార్డు సృష్టించిన ఈ చైనా బాలిక.. ఇప్పుడు ఏకంగా టోర్నీలో రెండు స్వర్ణ పతకాలు కొల్లగొట్టి వారెవ్వా అనిపించింది. తొలిరోజు పోటీల్లో మహిళల స్విమ్మింగ్ 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ ఈవెంట్‌లో పసిడి నెగ్గిన జిది.. రెండో రోజైన సోమవారం 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే విభాగంలోనూ టైటిల్ సాధించి రెండో బంగారు పతకాన్ని ఖాతాలో వేసుకుంది. అంతేకాదు సరికొత్త ఆసియాడ్ రికార్డు టైమింగ్‌ను నెలకొల్పడం విశేషం. అంతకుముందు మొదటి స్వర్ణం నెగ్గే క్రమంలోనూ ఈ క్రీడల రికార్డు టైమింగ్‌ను నమోదు చేసింది. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న జిది.. గతేడాది ప్రపంచ చాంపియన్‌షిప్ ఫ్రీస్టయిల్ రిలే ఈవెంట్‌లో కాంస్యం నెగ్గి పిన్న వయసులో ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం అందుకున్న స్విమ్మర్‌గా చరిత్ర సృష్టించింది.

# బిజినెస్





# కీలక ప్రకటన చేసిన కేంద్రం

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ (వంటగ్యాస్) సిలిండర్ల కొరత ఏర్పడుతుందంటూ సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున వార్తలను వస్తున్నాయి. ఈ ఊహాగానాలను కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీ తీవ్రంగా స్పందిస్తూ ఖండించారు. గ్యాస్ సిలిండర్ల కొరత భయంతో ఏజెన్సీల వద్ద ప్రజలు క్యూ కట్టాల్సిన అవసరం లేదని, అవాస్తవ ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకున్న ముందస్తు దౌత్య, పరిపాలనా చర్యల వల్ల ముడి చమురు, ఇంధన సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతంగా అధిగమించామని తెలిపారు. మొబైల్ యాప్‌ల ద్వారా డిజిటల్ పద్ధతిలో బుక్ చేసుకుంటే 24 గంటల్లోనే సిలిండర్ ఇంటి వద్దకే చేరుతుందని, సరఫరా వ్యవస్థ అత్యంత పటిష్టంగా ఉందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ఏర్పడిన ఒడిదుడుకులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు వ్యూహంతో దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని గణనీయంగా పెంచినట్లు కేంద్ర మంత్రి వివరించారు. గతంలో రోజుకు 34 వేల టన్నులుగా ఉన్న దేశీయ వంట గ్యాస్ ఉత్పత్తిని ప్రస్తుతం 55 వేల నుంచి 56 వేల టన్నులకు పెంచామని వెల్లడించారు. అంతేకాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న 1.07 లక్షల పెట్రోల్ పంపుల్లో ఎక్కడా కూడా ఇంధన కొరత లేదని, పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని తేల్చిచెప్పారు. ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించి బ్లాక్ మార్కెటింగ్ లేదా హోర్డింగ్‌కు పాల్పడే వారిపై నిఘా ఉంచామని, దేశంలో ఇంధన భద్రత పట్ల ప్రజలు ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని మంత్రి పునరుద్ఘాటించారు.




# ఫోన్‌పే, జీపేల కథ ఏంటి ?

భారత డిజిటల్ చెల్లింపుల మార్కెట్లోకి ప్రపంచ టెక్ దిగ్గజం యాపిల్ అడుగుపెట్టేందుకు రంగం సిద్ధమైంది. గ్లోబల్ మార్కెట్‌లో యాపిల్ పే అందుబాటులోకి వచ్చిన దాదాపు పుష్కర కాలం తర్వాత భారత్‌లో లాంచ్ కానుండటం టెక్ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే ప్రస్తుతం దేశీయంగా 84 శాతానికి పైగా మార్కెట్‌ను శాసిస్తున్న ఫోన్‌పే, గూగుల్ పే ఆధిపత్యానికి ఇది ఎంతవరకు గండి కొడుతుందనే దానిపై ప్రస్తుతం ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ప్రస్తుతం భారత్‌లో వీధి వ్యాపారుల నుంచి భారీ షాపింగ్ మాల్స్ వరకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నేరుగా బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు పంపే యూపీఐ పద్ధతే అత్యంత ప్రాచుర్యంలో ఉంది.ఇలాంటి టైంలో ఇండియా మార్కెట్‌లోకి అడుగు పెట్టడానికి రెడీ అవుతున్న యాపిల్ పే ఎలాంటి సేవలతో యూజర్స్‌ను ఆకట్టుకుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తాజాగా సమాచారం ప్రకారం.. భారత్‌లో యాపిల్ పే ప్రారంభ దశలో ప్రధానంగా క్రెడిట్ కార్డుల ఆధారిత 'ట్యాప్ అండ్ పే' (POS మెషీన్లపై కార్డుతో పనిలేకుండా స్వైప్ చేసే విధానం) సేవలతోనే రావచ్చని తెలుస్తోంది. ప్రాథమికంగా యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో ఈ సేవలు స్టార్ట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ మొదటి దశలో క్యూఆర్ కోడ్ ఆధారిత యూపీఐ సదుపాయం లేకపోతే, నిత్యం చిన్న మొత్తాల లావాదేవీలు జరిపే సాధారణ యూజర్స్‌ను ఇది పెద్దగా ఆకర్షించలేకపోవచ్చనే అభిప్రాయాలు మార్కెట్ వర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి. పైగా ఫోన్‌పే, గూగుల్ పేలు ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెండింటిలోనూ పనిచేస్తుండగా, యాపిల్ పే కేవలం ఐఫోన్, యాపిల్ వాచ్ యూజర్లకు మాత్రమే పరిమితం కానుంది.అయితే యాపిల్ పే భారత్‌లో యూపీఐ సపోర్ట్‌తో కూడా రావచ్చని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. ఒకవేళ నేరుగా యూపీఐ నెట్‌వర్క్‌తో యాపిల్ పే మార్కెట్‌లో దిగితే అప్పుడు సమీకరణాలు పూర్తిగా మారిపోయే ఛాన్స్ ఉందని అంటున్నారు. ప్రత్యేకంగా ఎలాంటి థర్డ్ పార్టీ యాప్‌లు తెరవాల్సిన అవసరం లేకుండా, ఫోన్ లాక్ స్క్రీన్‌లో ఉన్నప్పుడే కేవలం 'ఫేస్ ఐడీ' లేదా 'టచ్ ఐడీ' బయోమెట్రిక్ వెరిఫికేషన్‌తో పేమెంట్ పూర్తయ్యేలా యాపిల్ పే పనిచేస్తుంది. దీంతో ఐఫోన్ వాడుతున్న ప్రీమియం కస్టమర్లు ఫోన్‌పే, గూగుల్ పేలకు బదులుగా ఇన్-బిల్ట్‌గా ఉండే యాపిల్ పే వైపు మొగ్గు చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. తొలి దశలో కేవలం క్రెడిట్ కార్డుల చెల్లింపులకే పరిమితమైతే, దేశీయ పేమెంట్ యాప్‌లకు తక్షణ ముప్పు లేకపోయినప్పటికీ, భవిష్యత్తులో యాపిల్ పే యూపీఐ సేవలపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే మాత్రం భారత డిజిటల్ చెల్లింపుల రంగంలో తీవ్ర పోటీ నెలకొనడం ఖాయంగా కనిపిస్తోందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# లక్ష కోట్లు దాటిన ఎల్ఐసీ పెట్టుబడులు




దేశంలో అతిపెద్ద సంస్థాగత ఇన్వెస్టర్‌గా ఉన్న ఎల్ఐసీ టాటా గ్రూప్ షేర్లలో తన పెట్టుబడులను భారీగా పెంచింది. టాటా గ్రూప్‌లోని 14 లిస్టెడ్ కంపెనీల్లో ఎల్ఐసీకి వాటాలు ఉండగా, 2022 నుంచి వీటిలో 10 కంపెనీల్లో తన వాటాను పెంచుకుంది. దీంతో టాటా గ్రూప్‌లో ఎల్ఐసీ పెట్టుబడుల మొత్తం విలువ ప్రస్తుతం రూ. లక్ష కోట్ల మార్కును దాటింది. ఇందులో టీసీఎస్‌లో అత్యధిక పెట్టుబడులు ఉన్నాయి. కంపెనీలో ఎల్ఐసీకి ఉన్న 5.52 శాతం వాటా విలువ దాదాపు రూ.41,960 కోట్లు. టాటా స్టీల్‌లో 6.3 శాతం వాటా విలువ రూ.14,000 కోట్లకు పైగా ఉంది. ఇక టాటా ఎల్క్సీలో ఎల్ఐసీ వాటా 2022లోని 1.04 శాతం నుంచి 6.59 శాతానికి, టాటా మోటార్స్ కమర్షియల్‌లో 0.79 శాతం నుంచి 5.08 శాతానికి, ట్రెంట్‌లో సున్నా నుంచి 3.03 శాతానికి పెరిగింది. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్‌లో వాటా 8.65 శాతానికి, టాటా కెమికల్స్‌లో 9.24 శాతానికి, వోల్టాస్‌లో 7.08 శాతానికి, ఇండియన్ హోటల్స్‌లో 2.64 శాతానికి చేరింది. మొత్తంగా ఎల్ఐసీ ప్రస్తుతం దాదాపు రూ.16 లక్షల కోట్ల విలువైన షేర్ల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉండగా, ప్రభుత్వ, కార్పొరేట్ బాండ్లు వంటి ఇతర ఆస్తుల్లో మరో రూ.50.7 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఉన్నాయి.



# మళ్లీ తగ్గిన బంగారం ధరలు..

గత కొద్ది రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం ధరలు మంగళవారం ఉదయం కూడా స్వల్ప తగ్గుదలను నమోదు చేశాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,54,570గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,41,690గా ఉంది.మరోవైపు వెండి ధరలు కూడా స్వల్ప తగ్గుదల నమోదు చేశాయి. కిలోకు వంద రూపాయల మేర తగ్గాయి.

ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ.2,49,900గా ఉంది.

# మాకు అలవాటు అయిపోందిలే




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ హను రాఘవపూడి కలయికలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'ఫౌజీ'. ఈ చిత్రంలో ప్రభాస్ ఒక వీరోచిత సైనికుడి పాత్రలో కనిపిస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు భారీగా ఉన్నాయి. అయితే ఈ సినిమా ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కావాల్సి ఉంది. అయితే గత కొద్దీ రోజులుగా ఫౌజీ పోస్ట్ పోన్ అవుతుందంటూ వార్తలు వెలువడుతున్నాయి కానీ మేకర్స్ వాటిని ఎక్కడ ఖండించలేదు. దాంతో అసలు ఈ ఈసినిమా రిలీజ్ విషయంలో ఫ్యాన్స్ లో కాస్త గందరగోళం నెలకొంది. అయితే ఈ పోస్ట్ పోన్ వార్తలపై ఎట్టకేలకు స్పందించారు మేకర్స్. గడచిన రాత్రి జరిగిన 'ది ప్యారడైజ్' మూవీ ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ 'ఫౌజీ చిత్రం థియేటర్లలోకి రావడానికి కాస్త సమయం పడుతుందని, కానీ ఎప్పుడు వచ్చిన ప్రభాస్ కెరీర్‌లో బాహుబలి తర్వాత ఆ రేంజ్ మూవీ అవుతుందని వెల్లడించారు. గత కొన్నేళ్లుగా ప్రభాస్ సినిమాలు అనుకున్న డేట్ కు రావడం లేదు. దాంతో సినిమా రిలీజ్ పోస్ట్ పోన్ అవడం వంటివి మాకు అలవాటు అయిపోయిందని కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పుడు అభిమానుల దృష్టి అంతా కొత్త రిలీజ్ డేట్‌పైనే ఉంది. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో ప్రభాస్ సరసన ఇమాన్వి కథానాయికగా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది.

## 'ఆల్మోస్ట్ నల్లవన్'... అప్డేట్ ఇచ్చిన దుషారా విజయన్




కోలీవుడ్ టాలెంటెడ్ యంగ్ బ్యూటీ దుషారా విజయన్ వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ జోరుమీదున్నారు. ఇటీవల 'జీడి నాయుడు' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఈ భామ.. తాజాగా మరో ఆసక్తికరమైన చిత్రంతో వస్తున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఆల్మోస్ట్ నల్లవన్'. ఈ చిత్రానికి ప్రముఖ నటుడు రాజు జయమోహన్ దర్శకత్వం వహిస్తుండటంతో పాటు ఇందులో ప్రధాన పాత్రలోనూ నటిస్తున్నారు. మరో విశేషం ఏమిటంటే.. టాలెంటెడ్ డైరెక్టర్ హెచ్. వినోద్ ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'ఆస్పైర్ ఉబుంటు ఫిల్మ్స్' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో సీనియర్ నటుడు సత్యరాజ్, ఇమ్మాన్ అన్నాచ్చి, తామరై సెల్వి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన మొదటి షెడ్యూల్ విజయవంతంగా పూర్తి కాగా.. తాజాగా, దుషారా రెండో షెడ్యూల్ అప్డేట్ ఇచ్చారు. ప్రస్తుతం రెండో షెడ్యూల్ షూటింగ్ తెన్కాశి పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోందని వెల్లడించారు. అంతేకాకుండా షూటింగ్ స్పాట్‌కు సంబంధించిన కొన్ని ప్రత్యేక ఫొటోలను కూడా ఆమె షేర్ చేయడంతో నెట్టింట వైరల్ అవుతున్నాయి. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రానున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో అప్పుడే మంచి అంచనాలు నెలకొన్నాయి.

## కార్తికేయ-10 టైటిల్ ఫిక్స్..




RX-100 చిత్రంతో టాలీవుడ్‌లో ఫుల్ క్రేజ్ తెచ్చుకున్న యంగ్ హీరో కార్తికేయ గుమ్మకొండ ప్రస్తుతం తన 10వ మూవీకి సిద్ధం అవుతున్నాడు. మొదటి చిత్రంతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ హీరో ప్రస్తుతం విజయం కోసం పరితపిస్తున్న తరుణంలో చేయబోతున్న ఓ వినూత్న ప్రయత్నం ఈ మూవీ. ఈ మూవీతో కార్తికేయ దర్శకుడిగా మారబోతున్నాడు. బాక్సింగ్ నేపథ్యంలో కూడిన ఓ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ మూవీకి సంబంధించిన టైటిల్‌ను రివీల్ చేశారు మేకర్స్. నేడు కార్తికేయ బర్త్‌డే కావడంతో ఈ సందర్భంగా.. టైటిల్‌ను రివీల్ చేస్తూ.. 'మూడేళ్లు.. ఒక పోరాట యోధుడు.. ఎన్నో సమాధానం లేని ప్రశ్నలు.. కార్తికేయ-10 చిత్రానికి 'కమ్ బ్యాక్' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేశారు' అంటూ ఓ చిన్న టైటిల్ గ్లింప్స్‌ను రిలీజ్ చేసి హైప్ పెంచారు మేకర్స్. ఇక ఈ మూవీని కార్తికేయ తన సొంత బ్యానర్ అయిన 'కార్తికేయ క్రియేటివ్ వర్క్స్'పై నిర్మిస్తుండగా.. విజయ్ బుల్గానిక్ సంగీతం అందిస్తున్నాడు.

## క్యాస్టింగ్ కౌచ్‌పై అంకితా...




బాలీవుడ్ టాలెంటెడ్ నటి అంకితా లోఖండే సినిమా ఇండస్ట్రీలో తాను ఎదుర్కొన్న భయానక అనుభవం గురించి తాజాగా బయటపెట్టారు. కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న క్యాస్టింగ్ కౌచ్ వేధింపుల గురించి ఆమె చేసిన కామెంట్లు ప్రస్తుతం నెట్టింట సంచలనంగా మారాయి. చిన్న వయసులోనే ఇండస్ట్రీలో ఎంతటి నీచమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చిందో ఆమె వివరించారు. అంకితా లోఖండే ఆ రోజులను గుర్తుచేసుకుంటూ, తనకు అప్పుడు కేవలం 19 ఏళ్లు మాత్రమేనని, హీరోయిన్ కావాలనే కలలతో ఇండస్ట్రీకి వచ్చానని చెప్పారు. ఒక ఆడిషన్ తర్వాత వాళ్లు తనను సెలెక్ట్ చేశామని, కాంట్రాక్ట్ సంతకం చేయడానికి రమ్మని పిలిచారని తెలిపారు. ఆ ఆనందంతో వెంటనే తాను తన తల్లికి ఫోన్ చేసి ఆ గుడ్ న్యూస్ చెప్పానని అన్నారు. అయితే ఆఫీస్‌కు వెళ్లిన తర్వాత అక్కడ అసలు రూపం బయటపడిందని ఆమె తెలిపారు. తన కోఆర్డినేటర్‌ను బయటే ఉంచి తనను ఒక్కదాన్నే లోపలికి పిలిచారని, ఆ తర్వాత వాళ్లు తనను కాంప్రమైజ్ కావాలని డిమాండ్ చేశారని చెప్పారు. ఆ మాట అర్థం ఏంటో స్పష్టంగా అడిగితే, నేరుగా నిర్మాతతో పడక పంచుకుంటే అవకాశం ఇస్తామని చెప్పారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఆ పరిస్థితుల్లో తాను ఏమాత్రం భయపడిపోలేదని, ధైర్యంగా నిలబడి గట్టిగా బుద్ధి చెప్పానని అంకితా వెల్లడించారు. వెంటనే తాను లేచి నిలబడి, మీ నిర్మాతకు కావాల్సింది టాలెంట్ కాదు, కేవలం బెడ్ షేర్ చేసుకోవడానికి ఒక అమ్మాయి అంతేనని, కానీ ఆ అమ్మాయిని తాను కాదని ముఖంపైనే చెప్పేసి బయటకు వచ్చేశానని తెలిపారు. ఆ రోజే తాను ఒక కఠినమైన నిర్ణయం తీసుకున్నానని, ఇండస్ట్రీలో ఎక్కడా తనను అలాంటి నీచమైన కోరిక కోరే సాహసం ఏ ఒక్కరూ చేయకూడదని గట్టిగా నిశ్చయించుకున్నానని అంకితా పేర్కొన్నారు. ప్రస్తుతం నెటిజన్లు ఆమెకు పెద్దఎత్తున మద్దతుగా నిలుస్తున్నారు.

## తదుపరి చిత్రంపై భారీ అప్డేట్!



మెగాప్రిన్స్ వరుణ్ తేజ్ ఇటీవల 'కొరియన్ కనకరాజు' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయం అందుకున్నాడు. 2017లో వచ్చిన 'ఫిదా' తర్వాత.. మళ్లీ ఇన్నాళ్లకు 'KOKA'తో కంబ్యాక్ ఇచ్చాడు వరుణ్. దీంతో ఇప్పుడు సినీ కెరీర్‌పై గట్టి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తుండగా.. తన తదుపరి చిత్రాల కోసం ఆచి తూచి అడుగులు వేస్తున్నాడట వరుణ్. ఇందులో భాగంగానే ఈ మెగాప్రిన్స్ ఓ స్టార్ నిర్మాణ సంస్థతో చేతులు కలిపాడట. కోకా విజయం తర్వాత, మరో రెండు పెద్ద నిర్మాణ సంస్థలు రాబోయే చిత్రాల కోసం వరుణ్ తేజ్‌కు అడ్వాన్సులు ఇచ్చాయని తెలుస్తుండగా.. అందులో ఒకటి సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై వస్తోందని ఫిలిమ్ వర్గాల నుంచి టాక్. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం వరుణ్ తేజ్ 'భరి' చిత్రంతో బిజీగా ఉన్నాడు. స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రానికి యదు వంశీ దర్శకత్వం వహిస్తుండగా.. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారికి కొణిదెల అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుంది. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల అయ్యేందుకు సిద్ధం అవుతుండగా.. ఈ సినిమా షూటింగ్ పూర్తి అయిన తర్వాత సుకుమార్ రైటింగ్స్ నుంచి వస్తోన్న ప్రాజెక్టుపై అఫీషియల్ అప్డేట్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు టాక్.




## నీలాంబరిని విద్యాబాలన్ మైమరిపించగలదా..?

జైలర్2 కోసం నరసింహ లెవల్ ప్లాన్ చేస్తున్నాడు నెల్సన్ దిలీప్ కుమార్. రజనీ కాంత్‌తో ఫేసాఫ్‌కు సమ ఉజ్జీవులైన స్టార్స్ ఉన్నప్పటికీ, యాంటోగనిస్టుగా ఫీమేల్‌ను సెలక్ట్ చేసుకున్నాడు. జైలర్2లో రజనీతో ఢీకొట్టబోతోంది విద్యాబాలన్. కాంత అనే పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో, ఇంటెన్స్ లుక్‌లో కనిపించబోతుంది. సౌత్ మూలాలున్న విద్యాబాలన్ బాలీవుడ్‌లో పాపులరై అక్కడే సెటిలైంది. కానీ సౌత్ అంటే అభిమానంతో ఇక్కడి నుంచి వచ్చిన ఆఫర్స్ కాదనకుండా చేస్తోంది. ఉరిమి, ఎన్టీఆర్ కథనాయకుడు, మహానాయకుడిలో నటించి మంచి పర్ఫామెన్స్ చేసింది కూడా. అటు తమిళంలో అజిత్ 'నేర్కొండ పార్వాయి'లో చిన్న రోల్ చేసిన విద్యా ఇప్పుడు జైలర్2లో ఫుల్ లెంత్ రోల్‌లో కనిపించబోతోంది. ఈ మూవీ అక్టోబర్ 15న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాలో విద్యాబాలన్ చేయబోయే క్యారెక్టర్ నరసింహ సినిమాలో రమ్యకృష్ణ పాత్రను మించి ఉండబోతోందని టాక్. తాజాగా విడుదల చేసిన జైలర్ 2 కాంత ప్రోమో చూస్తే అలానే అనిపించింది. నీలాంబరి పాత్రలో తలైవర్‌నే డామినేట్ చేసేసింది రమ్య. విద్యాబాలన్ కూడా 'కాంత' రోల్‌తో కట్టిపడేస్తుందేమో చూడాలి. ప్రస్తుతం విద్యా ఆచి తూచి సినిమాలు చేస్తోంది. జైలర్2తో పాటు అక్షయ్ కుమార్, అనీజ్ బజ్మీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మూవీలో నటిస్తోంది. ఇందులో రాశీ ఖన్నా మరో హీరోయిన్. డర్టీ పిక్చర్ మూవీ విద్యా బాలన్ కెరీర్‌కు ఓ మైల్ స్టోన్‌లా మారినట్లు.. కాంత రోల్ ఆమెను మరో మెట్టెక్కిస్తుందేమో చూడాలి.

## మొట్టమొదటిసారి పౌరాణిక పాత్రలో రాఘవ లారెన్స్..




డైరెక్టర్ రమేష్ వర్మ తెరకెక్కిస్తున్న పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'మహావీర్ కర్ణ'. ఈ భారీ చిత్రంలో రాఘవ లారెన్స్ కర్ణుడి పాత్రలో నటిస్తున్నారు. తాజాగా మేకర్స్ విడుదల చేసిన లారెన్స్ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ 'పెన్ మూవీస్' ఈ పోస్టర్‌ను షేర్ చేస్తూ.. ఒక ముఖం, ఒక లెజెండ్, ఒక యోధుడు అంటూ అంచనాలను పెంచేశారు. ఇక ఈ విషయంపై రాఘవ లారెన్స్ స్పందిస్తూ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తన కెరీర్‌లో ఫస్ట్ టైమ్ పురాణ పాత్రలో నటిస్తున్న లారెన్స్.. ఈ ప్రాజెక్ట్ గురించి స్పందిస్తూ.. "మన పురాణాల్లోని అత్యంత శక్తివంతమైన, లెజెండరీ పాత్ర అయిన కర్ణుడి పాత్రలో నటించడం నాకు దక్కిన గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఈ స్క్రిప్ట్ నా దగ్గరకు వస్తుందని నేను అసలు ఊహించలేదు. ఈ అద్భుతమైన అవకాశం ఇచ్చిన డైరెక్టర్ రమేష్ వర్మకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఎంతో వినయంతో, కృతజ్ఞతా భావంతో ఈ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాను. మీ అందరి ఆశీస్సులు, సపోర్ట్ నాకు ఎప్పుడూ ఉండాలి" అంటూ లారెన్స్ రాసుకొచ్చారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**